PRGI RNI : TGTEL/25/A5065

vaartha sandhya

వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు

vaarthasadhya@gmail.com

epaper.vaarthasadhya.com

విలేకరులు కావలెను!

మా వార్త సంధ్య పత్రిక మరియు CM NEWS TV టీవీ కోసం

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

హైదరాబాద్ & అమరావతి

మరియు జిల్లాల వ్యాప్తంగా కావలెను.

CM NEWS For The People

విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక,
రాజకీయ మరియు ప్రజా సమస్యలపై
పరిశోధనాత్మక వార్తల సేకరణ కొరకు
జిల్లా స్థాయి విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి


7396122101 vaarthasadhya@gmail.com

9951751662 epaper.vaarthasadhya.com

13-22/43, Plot No:203, VV Nagar Colony, Gaddiannaram, Ranga Reddy Dist. - Hyderabad, Telangana 500060

Published From : Rangareddy VOLUME : 01 Issue : 262 Saturday, 12-09-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet



భూకంపాన్ని సృష్టించిన ఇజ్రాయెల్..

- హెజ్బొల్లా టన్నెల్‌పై ఇజ్రాయెల్ దాడి.. 4.1 తీవ్రతతో భూకంపం
- బాంబుల తీవ్రతతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ ప్రకంపనలు
- భూకంపంగా నమోదైన ప్రకంపనలు.. 4.1 తీవ్రతగా గుర్తింపు
- దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాల్లో ప్రకంపనల ప్రభావం
- అలి అల్ తాహెర్ రిడ్జ్‌లో హెజ్బొల్లా స్థావరంపై దాడి
- భారీ దాడితో టన్నెల్ పూర్తిగా కూల్చివేత
- దాడిని ధ్రువీకరించిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు
- ఇరాన్ నిధులతో నిర్మించిన స్థావరాలను ధ్వంసం చేశామన్న ఇజ్రాయెల్



కులగణన ఒక 'ఎక్స్‌రే'

- తెలంగాణ కులగణన సర్వే దేశానికే ఆదర్శం
- జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలి
- కులగణన చేద్దామా? వద్దా? బీజేపీ సూటిగా చెప్పాలి
- కులగణనతోనే బలహీన వర్గాలకు న్యాయం..
- దేశ సంపద సమాన పంపిణీకి మార్గం
- తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా సర్వే చేయాలి
- వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


హైదరాబాద్,

దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వేను దేశానికి ఆదర్శంగా తీసుకుని, దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో జనగణన, కులగణన అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. కులగణన అనేది కులాలకు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. సమాజంలో -మిగతా 2 లో

పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరించం

సాంకేతిక విద్యకు పరిశ్రమల అనుసంధానం

- జీఓ 97పై అపోహలుంటే సవరణలు చేస్తాం
- స్కిల్ యూనివర్సిటీకి ఏఐసిటిఇ అనుమతి తెస్తాం
- విద్యార్థులు రాజకీయ నాయకుల ఉచ్చులో పడొద్దు
- అర్హత గల కాలేజీలకే ఫీజు రీయింబర్స్‌మెంట్
- విద్యార్థి ముఖ గుర్తింపు హాజరు ప్రాతిపదికన చెల్లింపు
- విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచుతున్నాం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్:

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వ ఆధీనంలో ఏ విధంగా ఉన్నాయో.. ఇకపై కూడా అలాగే కొనసాగుతాయని తెలిపారు. సాంకేతిక విద్యను పరిశ్రమల అవసరాలకు అనుసంధానం చేసి, విద్యార్థులకు ఆధునిక నైపుణ్యాలు, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతోనే పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయంపై విద్యార్థుల్లో ఉన్న అపోహలను తొలగిస్తామని, జీఓ 97లో ఏవైనా సవరణలు అవసరమైతే చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర శాసనసభలో తెలంగాణ విద్యా విధానంపై జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానంగా సుదీర్ఘంగా ప్రసంగించారు. జెన్యూన్ కాలేజీలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని, విద్యార్థుల -మిగతా 2 లో




బ్రిక్స్‌దే పైచేయి..

- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ వాటా దాదాపు 40 శాతమన్న పుతిన్
- జీ7 దేశాల ఆర్థిక వాటా 29 శాతానికే పరిమితమైందని వ్యాఖ్య
- ప్రపంచ ఆర్థిక నాయకత్వంలో మార్పులు అనివార్యమన్న రష్యా అధ్యక్షుడు
- బ్రిక్స్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక కూటమిగా అభివర్ణించిన పుతిన్
- పాశ్చాత్య దేశాలు పోటీదారులను బలహీనపరుస్తున్నాయని ఆరోపణ
- రష్యాపై 30 వేలకుపైగా ఆంక్షలు విధించారన్న పుతిన్
- ఆంక్షలున్నా రష్యా ఆర్థిక వృద్ధి కొనసాగుతోందని వెల్లడి
- మోదీ--పుతిన్ భేటీలో ఉక్రెయిన్ సంక్షోభం, ద్వైపాక్షిక అంశాలపై చర్చ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దూకుడు

- భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం
- 4 దేశాలతో మొదలైన కూటమి.. నేడు 21 దేశాల కుటుంబంగా విస్తరణ
- ప్రపంచ జనాభాలో దాదాపు సగం
- ప్రపంచ వాణిజ్యంలో నాలుగో వంతు వాటా
- వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికతలో సహకారానికి కొత్త అవకాశాలు
- బ్రిక్స్ ద్వారా ప్రపంచానికి భారత్ చేరువవుతోందన్న ప్రధాని మోడీ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి దూసుకెళ్తోంది. 4 దేశాలతో మొదలైన ఈ వేదిక నేడు 21 దేశాల కుటుంబంగా విస్తరించి.. ప్రపంచ జనాభాలో దాదాపు సగానికి, ప్రపంచ ఎగుమతుల్లో 24 శాతం వాటాకు ప్రతినిధిగా నిలిచింది. ఈ నేపథ్యంలో వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, సరఫరా గొలుసుల రంగాల్లో భారత్‌కు కొత్త అవకాశాలు తెరుచుకుంటున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు.



మరో ఉద్యమానికి బీఆర్ఎస్ సన్నద్ధం

రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు సమాయత్తం

- సాగునీటి ప్రాజెక్టుల వారీగా ఉద్యమాలు
- హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్‌పై పోరాటాలు
- ఫీజురియంబర్స్ మెంట్, 22ఏ, రైతాంగ సమస్యలే కీలకం
- కాంగ్రెస్ డిక్లరేషన్లు ప్రకటించిన ప్రాంతాల్లోనే బహిరంగ సభలు
- రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దిశా నిర్దేశం చేయనున్న గులాబీ దళపతి కేసీఆర్



హైదరాబాద్,

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలే లక్ష్యంగా, ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా బీఆర్ఎస్ మరో ఉద్యమానికి సిద్ధం అవుతున్నది. రాష్ట్రవ్యాప్త ఆందోళనలతో పాటు క్షేత్ర స్థాయి పోరాటాలకు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నది. రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో మాట్లాడే అవకాశాలు లేకుండా ప్రభుత్వం చేసిన దాడులు, సస్పెండ్ అంశాలను తీవ్రంగా పరిగణిస్తూ పోరాటాలకు సన్నద్ధం అవుతోంది. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రజాక్షేత్రంలోకి బీఆర్ఎస్ వెళ్లనుంది. కాంగ్రెస్ డిక్లరేషన్లు ప్రకటించిన ప్రాంతాల్లోనే బహిరంగ సభలు ఏర్పాటు చేసి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఉద్యమ ఎజెండాను బీఆర్ఎస్ రూపకల్పన చేస్తున్నది. గులాబీ అధినేత కేసీఆర్ తలపెట్టిన కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు సందర్శన -మిగతా 2 లో

వ్యాపారమా... వైద్యమా...?

- వనస్థలిపురంలో ఒక ఆసుపత్రి తీరుపై ప్రజల్లో వ్యతిరేకత..!
- సేవ చేయాల్సిన వైద్యం.. వ్యాపారంగా మారుతోందా?
- ఆసుపత్రికి వెళ్తే జేబుకు చిల్లులే అంటున్న బాధితులు
- పరీక్షలు, చికిత్సలు, బెడ్ ఛార్జీలతో భారీ బిల్లుల ఆరోపణలు
- ఆసుపత్రి నిర్వహణపై సమగ్ర విచారణ జరపాలంటున్న ప్రజలు



వార్త సంధ్య -- ప్రత్యేక కథనం

హైదరాబాద్: వైద్యం అంటే ప్రాణాలను కాపాడే సేవ. అనారోగ్యంతో ఆసుపత్రి గడప తొక్కిన ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించాల్సిన బాధ్యత వైద్య రంగంపై ఉంది. అయితే వైద్య సేవలు క్రమంగా వ్యాపార ధోరణులకు లోనవుతున్నాయనే విమర్శలు మాత్రం రోజురోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా వనస్థలిపురం పరిధిలోని ఓ ప్రముఖ ఆసుపత్రి వ్యవహారశైలిపై స్థానిక ప్రజలు, కొందరు రోగుల కుటుంబ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. "వ్యాపారమా.. వైద్యమా?" అనే ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో చర్చకు దారితీస్తోంది. చిన్నపాటి అనారోగ్య సమస్యతో ఆసుపత్రికి వెళ్లినా వివిధ రకాల పరీక్షలు, స్కానింగ్‌లు, వైద్య ప్రక్రియలు, సర్జరీల పేరుతో ఖర్చు పెరుగుతోందని కొందరు బాధితులు ఆరోపిస్తున్నారు. చికిత్స పూర్తయిన తర్వాత చేతిలో భారీ బిల్లు పెట్టడంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడుతోందని వారు వాపోతున్నారు.

ఆసుపత్రికి వెళ్తే జేబుకు చిల్లులేనా?

రోగి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని

-మిగతా 2 లో



vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

భూకంపాన్ని సృష్టించిన ఇజ్రాయెల్..

-హెజ్బొల్లా టన్నెల్‌పై ఇజ్రాయెల్ దాడి.. 4.1 తీవ్రతతో భూకంపం
-బాంబుల తీవ్రతతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ ప్రకంపనలు
-భూకంపంగా నమోదైన ప్రకంపనలు.. 4.1 తీవ్రతగా గుర్తింపు
-దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాల్లో ప్రకంపనల ప్రభావం
-అలి అల్ తాహెర్ రిడ్జ్‌లో హెజ్బొల్లా స్థావరంపై దాడి
-భారీ దాడితో టన్నెల్ పూర్తిగా కూల్చివేత
-దాడిని ధ్రువీకరించిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు
-ఇరాన్ నిధులతో నిర్మించిన స్థావరాలను ధ్వంసం చేశామన్న ఇజ్రాయెల్



నేటి టెక్నాలజీ యుగంలో బాంబు దాడులు ఎంత తీవ్రంగా ఉంటాయో చెప్పేందుకు ఈ దాడి ఒక ఉదాహరణ. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడి.. ఏకంగా భారీ భూకంపాన్ని సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్ని లెబనాన్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. భూకంప తీవ్రత 4.1గా నమోదైనట్లు అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే సంస్థ వెల్లడించింది.లెబనాన్‌లో హెజ్బొల్లా ఉగ్ర సంస్థకు చెందిన స్థావరాలు ఉన్న సంగతి తెలిసిందే. వీటిపై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. తాజాగా అలి అల్ తాహెర్ రిడ్జ్ ప్రాంతంలోని హెజ్బొల్లాకు చెందిన ఒక టన్నెల్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడికి పాల్పడింది. ఈ భారీ దాడితో ఆ టన్నెల్ కూలిపోయింది. ఇదే సమయంలో బాంబు తీవ్రత కారణంగా చుట్టుపక్కల ప్రకంపనలు వచ్చాయి. దీని కారణంగా స్థానికంగా భూకంపం నమోదైంది. ఈ భూకంపం తీవ్రత 4.1గా ఉన్నట్లు అమెరికా సంస్థ తెలిపింది.దక్షిణ లెబనాన్‌లోని నబాతే సహా అనేక ప్రాంతాల్లో ప్రకంపనలు కనిపించినట్లు వెల్లడించింది. లెబనాన్‌పై జరిపిన ఈ దాడిని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, రక్షణ శాఖ మంత్రి ఇజ్రాయెల్ కట్జు కూడా అంగీకరించారు. దశాబ్దాల క్రితం ఇరాన్ నిధులతో నిర్మించిన తీవ్రవాద స్థావరాల్ని ధ్వంసం చేసినట్లు వారు ప్రకటించారు. ఈ ప్రాంతంపై పట్టు సాధించినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన వీడియో కూడా విడుదలైంది.


ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దూకుడు

-భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం
-4 దేశాలతో మొదలైన కూటమి.. నేడు 21 దేశాల కుటుంబంగా విస్తరణ
-ప్రపంచ జనాభాలో దాదాపు సగం
-ప్రపంచ వాణిజ్యంలో నాలుగో వంతు వాటా
-వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికతలో సహకారానికి కొత్త అవకాశాలు
--బ్రిక్స్ ద్వారా ప్రపంచానికి భారత్ చేరువవుతోందన్న ప్రధాని మోడీ




లిన్యూఢిల్లీ:లి ప్రపంచ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాధాన్యం పెరుగుతున్న వేళ.. బ్రిక్స్ వేదికపై భారత్ తన స్వరాన్ని మరింత బలంగా వినిపిస్తోంది. న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సమావేశాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల పాత్ర, భారత్ సాధిస్తున్న ఆర్థిక ప్రగతి, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, సరఫరా గొలుసు వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. బ్రిక్స్ కేవలం ఒక అంతర్జాతీయ కూటమి కాదని.. ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న దేశాల ఆకాంక్షలకు ప్రతినిధిగా నిలుస్తోందని మోడీ స్పష్టం చేశారు. ప్రస్తుతం విస్తరించిన బ్రిక్స్ కుటుంబం ప్రపంచ జనాభాలో దాదాపు సగానికి ప్రాతినిధ్యం వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. బ్రిక్స్ ప్రాధాన్యాన్ని ప్రధాని మోడీ తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2006లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా దేశాలతో ప్రారంభమైన ఈ ఆలోచన.. తర్వాత దక్షిణాఫ్రికా చేరికతో బ్రిక్స్ గా మారింది. 2024 నుంచి ఈ కూటమి మరింత విస్తరించింది. ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ వంటి దేశాలు సభ్యులుగా చేరగా, 2025లో ఇండోనేషియా కూడా పూర్తి సభ్యత్వం పొందింది. ప్రస్తుతం 11 పూర్తి సభ్య దేశాలతో పాటు 10 భాగస్వామ్య దేశాలతో విస్తరించిన కుటుంబంగా బ్రిక్స్ ఎదిగింది. అందుకే మోడీ దీనిని '21 దేశాల కుటుంబం'గా అభివర్ణించారు. బ్రిక్స్ విస్తరణ వెనుక ఉన్న అసలు బలం దాని జనాభా, ఆర్థిక సామర్థ్యం. 11 సభ్య దేశాలు మాత్రమే కలిపినా ప్రపంచ జనాభాలో దాదాపు సగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. కొనుగోలు శక్తి సమానత్వం (ppp) ఆధారంగా ప్రపంచ జీడీపీలో సుమారు 40 శాతం వాటా బ్రిక్స్ దేశాలదే. ప్రపంచ వాణిజ్యంలోనూ ఈ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోంది. 2003లో బ్రిక్స్ దేశాల సరుకుల ఎగుమతులు సుమారు 900 బిలియన్ డాలర్లుగా ఉండగా.. 2024 నాటికి అవి దాదాపు 6 ట్రిలియన్ డాలర్లకు చేరాయి. ప్రపంచ ఎగుమతుల్లో బ్రిక్స్ వాటా కూడా దాదాపు రెట్టింపై 24 శాతానికి చేరిందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. భారత్‌కు బ్రిక్స్ కేవలం దౌత్య వేదిక కాదు. ఇది వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, ఇంధన భద్రత, సరఫరా గొలుసులు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో కొత్త అవకాశాలను సృష్టించే వేదికగా మారుతోంది. బ్రిక్స్ దేశాలతో భారత్ వాణిజ్యం కూడా గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా చైనా, రష్యా, యూఏఈ, ఇరాన్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా వంటి దేశాలతో భారత్‌కు వాణిజ్య, ఇంధన, పెట్టుబడి సంబంధాలు ఉన్నాయి. మోడీ ప్రసంగంలోని ప్రధాన సందేశం కూడా ఇదే. బ్రిక్స్ ద్వారా భారత్ ప్రపంచంతో మరింత బలమైన ఆర్థిక అనుసంధానాన్ని ఏర్పరుచుకుంటోంది. భారతదేశం తన మార్కెట్, తయారీ సామర్థ్యం, డిజిటల్ మౌలిక వసతులు, స్టార్టప్ వ్యవస్థ, సాంకేతిక నైపుణ్యాలను బ్రిక్స్ దేశాలతో అనుసంధానించేందుకు ప్రయత్నిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, వాణిజ్య ఆంక్షలు, సుంకాలు, సరఫరా గొలుసుల అంతరాయాలు కొనసాగుతున్న సమయంలో బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్య సహకారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. బ్రిక్స్ ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకు గవర్నర్లు కూడా అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో సంస్కరణలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం ఉండాలని వారు కోరారు.

బ్రిక్స్‌దే పైచేయి..



న్యూఢిల్లీ,
ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా దాదాపు 40 శాతానికి చేరగా.. జీ7 దేశాల వాటా 29 శాతానికే పరిమితమైందని తెలిపారు. ప్రపంచ ఆర్థిక నాయకత్వంలో మార్పులు అనివార్యమని పేర్కొన్నారు.న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ వ్యాపార సదస్సులో పుతిన్ మాట్లాడుతూ.. బ్రిక్స్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక కూటమిగా అభివర్ణించారు. భారత్ సహా సభ్య దేశాల ఆర్థిక ప్రభావం పెరుగుతోందని, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాశ్చాత్య దేశాలు పోటీదారులను బలహీనపరిచేందుకు ఆంక్షలను ఉపయోగిస్తున్నాయని ఆరోపించారు. రష్యాపై 30 వేలకుపైగా ఆంక్షలు విధించినప్పటికీ తమ దేశ ఆర్థిక వృద్ధి కొనసాగుతోందని తెలిపారు.
మోదీ--పుతిన్ భేటీ
బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్ దాదాపు 45 నిమిషాలపాటు సమావేశమయ్యారు. ఉక్రెయిన్ సంక్షోభం, భారత్--రష్యా ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. ఉక్రెయిన్ సమస్యకు చర్చలు, దౌత్యమే ఏకైక మార్గమని మోదీ పునరుద్ఘాటించారు. రక్షణ, ఇంధనం, వాణిజ్యం, అంతరిక్షం, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించడంపైనా ఇరువురు నేతలు చర్చించారు.

వ్యాపారమా..వైద్యమా..?



(మొదటి తరువాయి)

అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడం సహజమే. కానీ అవసరానికి మించి పరీక్షలు చేయిస్తున్నారా? ప్రత్యామ్నాయ చికిత్సా విధానాలను రోగి బంధువులకు వివరిస్తున్నారా? చికిత్స ప్రారంభించే ముందు అంచనా వ్యయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నారా? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.
కొంతమంది రోగుల కుటుంబాలు తమకు ఎదురైన అనుభవాలను వివరిస్తూ "ఆసుపత్రికి వెళ్లిన ప్రతిసారి జేబుకు చిల్లులు పడుతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. రోజుల తరబడి ఆసుపత్రిలో ఉంచడం వల్ల చికిత్స ఖర్చుతో పాటు బెడ్ ఛార్జీలు, నర్సింగ్ ఛార్జీలు, మందులు తదితర ఖర్చులు కూడా పెరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.
వైద్య సేవలా.. వ్యాపార మోడలా?
ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణకు ఖర్చులు ఉంటాయి. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పరికరాలు, మందులు, నిర్వహణ వంటి వాటికి వ్యయం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ఖర్చుల పేరుతో సామాన్య రోగులపై అధిక ఆర్థిక భారం పడకూడదని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రి నిర్వహణలో వైద్య రంగానికి సంబంధం లేని వ్యక్తులు అధికంగా జోక్యం చేసుకుంటున్నారా? రోగి అవసరాల కంటే ఆదాయానికే ప్రాధాన్యం ఇస్తున్నారా? అనే అనుమానాలు కూడా కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి నిర్వహణ కోసం కంపెనీ లేదా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమైన వ్యాపార నిర్మాణం కావచ్చు. కానీ ఆ సంస్థ ద్వారా రోగులపై అనవసరమైన ఆర్థిక భారం మోపుతున్నారనే ఆరోపణలు నిజమైతే సంబంధిత అధికారులు వాటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.
బాధితుల వాదనలు వెలుగులోకి వస్తాయా?
తమకు జరిగిన అనుభవాలకు సంబంధించిన బిల్లులు, వైద్య రికార్డులు, డిశ్చార్జ్ సమ్మరీలు తదితర ఆధారాలను చూపించేందుకు కొందరు బాధితులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. త్వరలో వారు మీడియా ముందుకు వచ్చి తమ ఆరోపణలను వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.
అయితే ఆరోపణలు మాత్రమే వాస్తవాలకు ఆధారం కావు. ప్రతి పరీక్ష లేదా సర్జరీ వైద్యపరంగా అవసరమా కాదా అనేది సంబంధిత వైద్య రికార్డులు, నిపుణుల అభిప్రాయాలు, కేసు పరిస్థితుల ఆధారంగా మాత్రమే నిర్ధారించాలి.
అధికారుల పర్యవేక్షణ అవసరం
ప్రజల ప్రాణాలతో ముడిపడిన వైద్య రంగంలో పారదర్శకత అత్యంత కీలకం. రోగికి ఏ చికిత్స చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు? దాని ఖర్చు ఎంత? ఎన్ని రోజులు ఆసుపత్రిలో ఉంచాల్సి ఉంటుంది? వంటి అంశాలను ముందుగానే స్పష్టంగా తెలియజేయడం అవసరం.
వనస్థలిపురంలోని సదరు ఆసుపత్రిపై వస్తున్న ఆరోపణలపై సంబంధిత వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.
వైద్యం సేవగా ఉండాలి.. వ్యాపారం మాత్రమే కాకూడదు.
రోగి ప్రాణం కంటే బిల్లు పెద్దదిగా మారకూడదు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉంది.

కులగణన ఒక 'ఎక్స్‌రే'

మొదటి తరువాయి

నెలకొన్న అసమానతలను సరిచేయాలంటే ముందుగా వాటి తీవ్రతను, స్వభావాన్ని తెలుసుకోవాల్సి ఉంటుందని, అందుకు కులగణన ఎంతో కీలకమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో ఏ కులానికి ఎంత జనాభా ఉంది, వారి వృత్తులు ఏమిటి, ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది, ఎంతమంది చదువుకున్నారు, ఎంతమంది ఉద్యోగాల్లో ఉన్నారు, ఎంతమంది నిరుద్యోగులు, భూమి ఉన్నవారు ఎంతమంది, లేనివారు ఎంతమంది వంటి అనేక అంశాలను కూలంకషంగా సేకరించామని చెప్పారు. ప్లానింగ్ శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎంగా తాను ప్రతిరోజూ ఈ ప్రక్రియను సమీక్షిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వేను నిర్వహించామని తెలిపారు. తెలంగాణలో నిర్వహించిన ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సైతం అభినందించారని గుర్తుచేశారు.
?దేశమంతా తెలంగాణ మోడల్ కావాలి తెలంగాణలో జరిగిన సర్వే తరహాలో దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి డిమాండ్ చేస్తోందని భట్టి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్‌లోని వివిధ పార్టీల నాయకులతో పాటు ప్రధానమంత్రిని కూడా కలిసి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. మంత్రులు కూడా ఈ అంశంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని వివరించారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన విధంగా స్పందన రాకపోవడంతో ఢిల్లీలో అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించి, తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని వివరించామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో కులగణన నిర్వహించాలని కోరామని చెప్పారు. ? జనగణన నిర్వహించే సమయంలోనే కులగణనను కూడా అందులో చేర్చుతామని అప్పట్లో కేంద్రం చెప్పిందని భట్టి గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో కులగణనను చేర్చకపోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జనగణనలో కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు. కులగణన లేకుండా దేశంలోని బలహీన వర్గాల వాస్తవ పరిస్థితులను ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. కులగణనను చేర్చకుండా ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ?"కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలి. కులగణనకు అనుకూలమైతే సభ తరఫున కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి పిలుపునివ్వాలి. వ్యతిరేకమైతే అదే విషయాన్ని స్పష్టంగా చెప్పాలి" అని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో సర్వే జరిగిన విషయాన్ని అసెంబ్లీలోనే అభినందించి, ఇప్పుడు దేశంలో ఎక్కడా కులగణన జరగలేదని చెప్పడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరుతున్నామని స్పష్టం చేశారు. సమాజంలో ఆస్తులు, వనరులు అందరికీ సమానంగా అందడం లేదని భట్టి పేర్కొన్నారు. ఈ అసమానతలను తొలగించాలంటే ముందుగా సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవాల్సి ఉంటుందని అన్నారు. "సమాజం ఆరోగ్యంగా లేకపోతే ముందుగా ఎక్స్‌రే తీయాలి. వ్యాధిని నిర్ధారించాలి. ఆ తర్వాతే చికిత్స చేయాలి. సమాజంలో ఉన్న అసమానతలను గుర్తించే ఎక్స్‌రేనే కులగణన" అని భట్టి అభివర్ణించారు. కులగణన ద్వారా వివిధ సామాజిక వర్గాల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయని, ఆ సమాచారం ఆధారంగా సంక్షేమ, అభివృద్ధి విధానాలను రూపొందించవచ్చని అన్నారు. జనాభా ప్రాతిపదికన అవకాశాలు, వనరులు, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. దేశంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా తెలంగాణలో నిర్వహించిన తరహాలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ సర్వే ద్వారా దేశంలోని వివిధ సామాజిక వర్గాల వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, వాటి ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు. జనాభా ప్రాతిపదికన దేశ అభివృద్ధికి అవసరమైన నిధులు, వనరులు, అవకాశాలు, ఆస్తులు అందరికీ న్యాయంగా, సమానంగా చేరేలా విధానాలను అమలు చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరించం

మొదటి తరువాయి

మొదటి తరువాయి

ముఖ గుర్తింపు హాజరు ప్రాతిపదికన చెల్లింపులు చేస్తామని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర నూతన విద్యా విధానాన్ని రూపొందించేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని, కమిషన్ ఇచ్చిన నివేదికను పరిశీలించేందుకు కె.కేశవరావు నేతృత్వంలో కమిటీని నియమించినట్లు తెలిపారు. సభ్యులు తమ సూచనలు, సలహాలను కమిటీకి అందిస్తే ప్రభుత్వం వాటిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉందన్నారు.
పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. పరిశ్రమల భాగస్వామ్యంతో ఆధునిక ప్రయోగశాలలు, పరికరాలు, శిక్షణ బాలా సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్స్, అప్రెంటిస్‌షిప్స్, ప్రాక్టికల్ ట్రైనింగ్ అవకాశాలను పెంచుతామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ వంటి కొత్త రంగాలకు అనుగుణంగా కోర్సులను ఆధునికరిస్తామని తెలిపారు. సాంకేతిక విద్య నైపుణ్యాభివృద్ధి విభాగాల అనుసంధానంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలిక వసతులు, ల్యాబ్లు, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధిని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.
భూములు అమ్ముకుంటారని తప్పుడు ప్రచారం పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తారని, వాటి భూములను విక్రయిస్తారని, ఉద్యోగాలు పోతాయని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మంచి సంకల్పంతో పనిచేస్తుంటే విద్యార్థుల్లో అపోహలు కలిగిస్తున్నారని అన్నారు. ఐటిఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఎటిసి) మార్చి టాటా సహకారంతో నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఎటిసిల కోసం ప్రభుత్వం అదనంగా 282 ఎకరాల రెవెన్యూ భూమిని బదిలీయించిందని, ఒక్కో ఎటిసిపై సుమారు రూ.46 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఎటిసిల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్కాలర్‌షిప్ అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. పాలిటెక్నిక్ విద్యకు సంబంధించి ఐసిటిఇ అనుమతులపై వస్తున్న విమర్శలపైనా సీఎం స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి అవసరమైన అనుమతులు తీసుకొస్తామని తెలిపారు. సాంకేతిక విద్యను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్చడం వల్ల విద్యార్థులకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.
పాలిటెక్నిక్ కళాశాలల విషయంలో రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. పేద విద్యార్థులకు అన్యాయం జరగనివ్వబోమని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. రాజకీయ పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని విద్యార్థులు, ప్రజలు అడ్డుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. అధికారం కోల్పోయినా అహంకారం మాత్రం పోలేదని వ్యాఖ్యానించారు. మాసబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పుడు అదే వ్యవస్థ అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు.
విద్యకు 15 శాతం బడ్జెట్ లక్ష్యం
విద్య ఒక్కటే జీవితాల్లో వెలుగులు నింపుతుందని తాను సంపూర్ణంగా నమ్ముతున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రపంచంతో పోటీపడాలంటే విద్యా విధానంలో మార్పులు అవసరమని పేర్కొన్నారు. విద్య కోసం రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం కేటాయించడమే తమ లక్ష్యమని చెప్పారు. గతంలో విద్యా రంగానికి తగ్గుతూ వచ్చిన బడ్జెట్ కేటాయింపులను తాము పెంచుతున్నామని చెప్పారు. 2023 24లో గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖకు రూ.19,093 కోట్లు కేటాయించగా.. తమ ప్రభుత్వం 2024 25లో రూ.21,292 కోట్లు కేటాయించిందన్నారు. 2025 26లో రూ.23,108 కోట్లకు, 2026 27లో రూ.26,647 కోట్లకు పెంచామని వివరించారు. మూడేళ్లలో విద్యాశాఖ బడ్జెట్‌ను రూ.7,554 కోట్లు పెంచామని చెప్పారు. అసెంబ్లీలో సభ్యులు ఇచ్చిన విలువైన సూచనలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు.

మరో ఉద్యమానికి బీఆర్ఎస్ సన్నాహం

మొదటి తరువాయి

రూట్ మ్యాప్ రూపొందించడంతో పాటు లక్షలాది జనాల సమీకరణలో నిమగ్నమైంది. త్వరలో గులాబీ దళపతి, పార్టీ అధినేత రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఉద్యమ కార్యాచరణపై దిశా నిర్దేశం చేయనున్నారు.
ప్రాజెక్టుల వారీగా పోరుబాట
తెలంగాణ సాగుభూములు ఎండిపోతుంటే కృష్ణా, గోదావరి జలాలను రేవంత్ రెడ్డి ఆంధ్రాకు తరలిస్తున్నారని బీఆర్ఎస్ మండిపడుతోంది. ప్రాజెక్టుల వారీగా ఆందోళనలు చేసేందుకు ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. కాళేశ్వరం 7వ బ్లాక్ 2 పిల్లర్లు కుంగిపోతే వాటిని పైసా ఖర్చు లేకుండా పునరుద్ధరించేందుకు ఎల్ అండ్ టీ ముందుకు వచ్చినా కాళేశ్వరం ప్రాజెక్టు లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ ప్రాజెక్టుల గేట్లు ఎత్తి ఆంధ్రాకు గోదావరి జలాలను తరలించడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా పరిగణిస్తున్నది. బీఆర్ఎస్ పాలనలో కోటి 25 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చి రికార్డు స్థాయిలో పంటలు పండితే రేవంత్ రెడ్డి పాలనలో లక్షల ఎకరాలకే పరిమితం కావడం పట్ల బీఆర్ఎస్ మండిపడుతూ రైతు ఉద్యమాలను ఈ సమావేశంలో ఖరారుచేయనున్నట్లు తెలిసింది. ప్రధానంగా సాగునీరు, రైతుబంధు, రైతుబీమా, కౌలు రైతులకు ఆర్థిక సహాయం అంశాలపై రైతాంగ పోరాటాలకు నడుంబిగించే అవకాశముంది.
గ్రామ స్థాయిలో ఉద్యమాలు
మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించిన చెరువులను పడవు పెట్టడంతో భూగర్భ జలాలు అడుగుంటి బొరుబావులు అందె 250 టీఎంసీల నీరు అందుకపోవడం తో 3లక్షల ఎకరాల పంటలు ప్రశార్నకమయ్యా యని బీఆర్ఎస్ అందోళన వ్యక్తం చేస్తూ చెరువుల పరిరక్షణకోసం గ్రామీణ స్థాయిలో ఉద్యమాలను రూపొందించేందుకు బీఆర్ఎస్ యోచిస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 16లక్షల ప్రభుత్వ భూములు నిషేధిత జాబితాలో ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం 22ఏ తీసుకువచ్చి కోటీ 16 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి తరతరాలుగా ప్రజల అధీనంలో ఉన్న భూములను ఆక్రమిస్తున్నందని, దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనలపై కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నట్లు నాయకులు చెబుతున్నారు. సుదీర్ఘ విరామం అనంతరం జరగనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కేసీఆర్ భవిష్యత్ కార్యాచరణ ప్రకటించడంతో పాటు ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్ట ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య, ప్రభుత్వం ప్రకటించిన రెండులక్షల ఉద్యోగాల నియామకాలపై బీఆర్ఎస్ యువజన పోరాటాలకు పదును పెట్టనున్నట్లు తెలిసింది. అలాగే ఫీజు రియంబర్స్ మెంట్, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు, ఉపాధి హామీ, నిరుద్యోగం అంశాలపై పోరుబాట పట్టేందుకు కార్యాచరణ రూపకల్పన జరగనుంది. డిసెంబర్ వరకు ప్రజా ఉద్యమాలు నిర్వహించి అనంతరం పాదయాత్రల కార్యాచరణ రూపొందించేందుకు బీఆర్ఎస్ యోచిస్తున్నది. ఇప్పటికే 2027లో పాదయాత్రలు చేయనున్నట్లు కేటీఆర్ ప్రకటించడంతో ఈ అంశం చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com epaper.vaarthasadhya.com

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.. ప్రభుత్వ పథకాలకు ఇదే కీలకం



కొరటికల్,: సెప్టెంబర్- 11: (వార్త సంధ్య)
వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కొరటికల్ వ్యవసాయ విస్తరణ అధికారి టి. వెంకటేష్ సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ప్రధాన మంత్రి కిసాన్ (పీఎం కిసాన్)తో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ సంక్షేమ పథకాల ప్రయోజనాలను రైతులు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.అలాగే ప్రభుత్వం ద్వారా ఎరువుల బుకింగ్ చేసుకోవాలన్నా ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుగానే ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం రైతులు భూమి పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ తీసుకుని తమ సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏ ఈ ఓ)ని సంప్రదించవచ్చని, లేదా సమీప మీసేవ కేంద్రంలో కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వెంకటేష్ తెలిపారు.అనంతరం ప్రస్తుతం వివిధ పంటల్లో కనిపిస్తున్న చీడపీడలు, వాటి లక్షణాలు, నివారణ చర్యలు, పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చీడపీడల ప్రారంభ దశలోనే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కొరటికల్ గ్రామ ఉపసర్పంచ్ మందుల అంజయ్య, వార్డు సభ్యురాలు దేవకమ్మతో పాటు పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమిపూజ



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) సెప్టెంబర్ 11
సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ బాగయత్ ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని పదిన్నర గంటలకు ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ పరిశ్రమల వాణిజ్యం శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ కర్మగారాలు ఘనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి శాసనమండలి సభ్యులు బొగ్గర దయానంద్ గుప్తా శాసనసభ్యులు బండారి లక్ష్మణ్ రెడ్డి రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు తెలంగాణ రాష్ట్ర రోడ్లు రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజ్యసభలు వేమ్ నరేందర్ రెడ్డి శాసనసభ్యులు నిజాంబాద్ అర్బన్ ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి నిజాంబాద్ మాజీ శాసనసభ్యులు బీగాల గణేష్ గుప్తా క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ టిపిసిసి మధుయాష్కి గౌడ్ తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ తదితరులు పాల్గొన్నారు వారు తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు

వేటగాళ్ల విద్యుత్ ఉచ్చుకు బలైన ఎఫ్‌బీవో నవీన్ కుటుంబానికి రూ.30 లక్షల భరోసా!



సింగరేణి ప్రతినిధి, సెప్టెంబర్ 11(వార్త సంధ్య)
వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు బలై మృతి చెందిన సింగరేణి మండలానికి చెందిన అటవీ శాఖ ఎఫ్‌బీవో బానోతు నవీన్ కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. అటవీ శాఖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నవీన్ భార్యకు రూ.30 లక్షల పరిహారం చెక్కును అందజేశారు. నవీన్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, అటవీ శాఖ ఉన్నతాధికారులు, వెంకటయ్య తండా మాజీ ఎంపీపీ బానోతు దేవల నాయక్, కారేపల్లి మండలానికి చెందిన మంగళం కంపెనీ జనరల్ మేనేజర్ రాజేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అడ్డగోడ ఐలయ్య, సుధాకర్, అడప పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రైస్ మిల్లర్ల బంద్





రైస్ మిల్లర్స్ బంద్ పాటిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు పెద్ది గణపతి రెడ్డి చెప్పారు

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) సెప్టెంబర్ 11. : సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ టాస్క్ ఫోర్స్ అధికారుల నిర్వహిస్తున్న ఆకస్మిక దాడులు వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వం రైస్ మిల్లర్ తో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు కష్టం మిల్లింగ్ రైస్ ఒప్పందాన్ని ఇరుపక్షాలకు న్యాయబద్ధంగా ఆమోదయ యోగంగా ఉండే విధంగా రూపొందించాలని ఆయన కోరారు ప్రతి రకం ధాన్యాన్ని శాస్త్రీయంగా టెస్ట్ బిల్డింగ్ నిర్వహించి ఖరీఫ్ , ర రవి సీజన్లో వేర్వేరుగా అవుట్ టర్న్ రేషియోను నిర్ణయించాలని సంబంధిత ధాన్యం రకం నాణ్యత పరిమా పరిగణలోనికి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు ప్రస్తుత నిర్వహణ ఖర్చులు పెరుగుతున్న విద్యుత్తు కార్మిక నిర్వహణ వ్యాయాలను పరిగణలోకి తీసుకొని క్వింటాల్కు ధాన్యాన్ని మిల్లింగ్ చార్జిని 150గా నిర్ణయించాలని పాత గన్ని బ్యాగ్ ధరను ఒక్క బ్యాగ్ రూ.11 గా నిర్ణయించాలని, 2014 నుంచి పెండింగ్లో ఉన్న సివిల్ సప్లై మిల్లింగ్ చార్జీలు రవాణా చార్జీలు చార్జీలు కస్టోడియన్ చార్జర్ వెంటనే చెల్లించాలని ఆయన కోరారు మిల్లర్లపై విధించిన 25 శాతం పెనాల్టీ 12 శాతం వడ్డీని పూర్తిగా మార్పు చేయాలని 20 22 ,23 రబి టెండర్ దాన్యం ధరను న్యాయబద్ధంగా సహేతుకంగా నిర్ణయించాలని రైస్ మిల్లర్ల వ్యవసాయ అనుబంధం పరిశ్రమగా గుర్తించి రెండు వందల హెచ్పి వరకు విద్యుత్ సరఫరా ఎల్టి కేటగిరి అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణమైన ధాన్యాన్ని మిల్లులకు సర్వ చేయాలని వాస్తవంగా నాణ్యతను బట్టి బియ్యం రికవరీ అవుట్ టర్న్ రేషియోను నిర్ణయించాలని ప్రభుత్వం విధానాలు విధానపరమైన జాతీయ లేదా వ్యవస్థలోని సమస్యల కారణంగా రైస్ బిల్లలకు వారి ఖాతాలను పూర్తిగా తేల్చి బకాయిలు నాలుగు విడతల్లో చెల్లించే అవకాశం కల్పించాలని ఆయన కోరారు ఖరీఫ్ ధాన్యాన్ని పూర్తిగా రైసుగా రవి ధాన్యాన్ని పూర్తిగా బాయిల్ రైసుగా మాత్రమే స్వీకరించాలని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విధించిన కఠినమైన నిబంధనలను రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న వాస్తవిక ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని సహేతకంగా చదివించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో జనరల్ సెక్రెటరీ వీరేశం కోశాధికారం వెంకటరమణ తోపాటు ధనలక్ష్మి తదితరులు పాల్గొని ప్రసంగించారు ఈరోజు నుంచి రైస్ మిల్లర్స్ బంద్ చేసి తాళం చేతిని రవికి అందజేశారు తమ సమస్యలు పరిష్కరించిన తర్వాతనే తాళం చెవి తీసుకుంటామని వారు చెప్పారు.

ఆలియాతండలో 'కరెంట్ హుకింగ్' కలకలం!

-మీటర్ లేకుండానే భారీ షెడ్డు నిర్మాణమా..?
- ఎల్‌టీ లైన్ నుంచి అక్రమ విద్యుత్ వినియోగిస్తున్నారన్న ఆరోపణలు
-భారీ వాహనం తగిలి వైరు తెగడంతో ప్రమాదం..
- విద్యుత్ శాఖ అధికారుల క్షేత్రస్థాయి తనిఖీకి స్థానికుల డిమాండ్

సింగరేణి ప్రతినిధి,సెప్టెంబర్ 11(వార్త సంధ్య)
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం లోని ఆలియాతండ శివార్లలో విద్యుత్ వినియోగంపై అనుమానాలు, ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. అధికారిక మీటర్ ఏర్పాటు చేయకుండానే ఎల్‌టీ విద్యుత్ లైన్ నుంచి నేరుగా సరఫరా తీసుకుని భారీ షెడ్డు నిర్మాణ పనులకు విద్యుత్ వినియోగిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మీటర్ లేకుండా కరెంట్ ఎలా..?
ఆలియాతండ వెనుక భాగంలో కొనసాగుతున్న భారీ షెడ్డు నిర్మాణ పనులకు విద్యుత్ సరఫరా ఎక్కడి నుంచి వస్తుందనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. అధికారిక విద్యుత్ మీటర్ ఉందా? లేక ఎల్‌టీ లైన్ నుంచి నేరుగా విద్యుత్ తీసుకుంటున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
నిర్మాణ పనులకు అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తున్నారనే ఆరోపణలు నిజమైతే, విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ వాహనం తగిలి వైరు తెగడంతో ప్రమాదం
ఇటీవల ఈ ప్రాంతం గుండా వెళ్లిన ఓ భారీ వాహనం విద్యుత్ వైర్లకు తగలడంతో వైరు తెగిపోయి కండక్టర్ స్నాప్ అయిన ఘటన చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో



కొంతసేపు అక్కడ ప్రమాదకర పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు.
విద్యుత్ లైన్ తక్కువ ఎత్తులో ఉందా? లైన్‌కు అనధికారికంగా ఏమైనా కనెక్షన్లు ఏర్పాటు చేశారా? అనే అంశాలపై అధికారులు సాంకేతికంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

హుకింగ్ జరిగిందా? అధికారుల తనిఖీతోనే తేలాలి
ఎల్‌టీ లైన్ నుంచి నేరుగా విద్యుత్ తీసుకున్నారనే ఆరోపణల్లో వాస్తవం ఎంత? షెడ్డు నిర్మాణానికి అధికారిక విద్యుత్ కనెక్షన్ ఉందా? మీటర్ ఎవరి పేరుతో ఉంది? వంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
అక్రమ విద్యుత్ వినియోగం జరిగినట్లు తనిఖీలో తేలితే, సంబంధిత వ్యక్తులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్మాణ అనుమతులపైనా పరిశీలన చేయాలి
విద్యుత్ వినియోగంతో పాటు భారీ షెడ్డు నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిర్మాణ నిబంధనలు పాటిస్తున్నారా? స్థలానికి సంబంధించిన అనుమతులు, భద్రతా ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయా? అనే అంశాలను కూడా సంబంధిత అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి వెళ్లిన వ్యవహారం
ఆలియాతండ శివార్లలో విద్యుత్ వినియోగంపై వస్తున్న ఆరోపణలు సంబంధిత అధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. అయితే ఆరోపణలు వాస్తవమా? కాదా? అన్నది అధికారులు ప్రత్యక్షంగా స్థలాన్ని పరిశీలించి, విద్యుత్ కనెక్షన్‌ను సాంకేతికంగా తనిఖీ చేసిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

క్షేత్రస్థాయి తనిఖీ ఎప్పుడు?
ప్రజల భద్రతకు సంబంధించిన అంశం కావడంతో విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఆలియాతండ శివార్లలోని షెడ్డు ప్రాంతాన్ని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎల్‌టీ లైన్ నుంచి హుకింగ్ జరిగిందా?
అధికారిక మీటర్ ఉందా?
షెడ్డు నిర్మాణానికి విద్యుత్ కనెక్షన్ ఎవరి పేరుతో ఉంది?
విద్యుత్ లైన్ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉందా?
ఈ ప్రశ్నలకు విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ అనంతరం స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

హుకింగ్‌పై అధికారులు కొరడా ఝుళిపిస్తారా?
ఆలియాతండ శివార్లలో వినిపిస్తున్న విద్యుత్ అక్రమ వినియోగ ఆరోపణలపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఆరోపణల్లో వాస్తవం ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లకు భద్రత కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ







హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)సెప్టెంబర్ 11
హైదరాబాద్ ప్రెస్ క్లబ్, హెచ్.ఎం.డి.ఏ ఆధ్వర్యంలో మట్టి గణేష్ విగ్రహాలను సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం నాడు పంపిణీ ప్రారంభించారు. ప్రెస్ క్లబ్ సభ్యులతోపాటు సాధారణ పౌరులకు మట్టి గణేష్ ప్రతిమలను పంపిణీ చేయడం జరుగుతుంది. ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి ,రమేష్ వరికుప్పల, జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, ప్రెస్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అమిత్ బట్టు, ముత్యాల సత్తిబాబు , ఎన్. ఉమా దేవి, మనం నాగరాజు, హెచ్.ఎం.డి.ఏ ఎస్. ఈ అప్పారావు, డిప్యూటీ ఈ ఈ గణేష్, అసిస్టెంట్ ఈ ఈ ఆశుతోష్ వర్మలు గణేష్ మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఏటా మట్టి గణేష్ విగ్రహాలను ప్రెస్ క్లబ్ పాలకమండలి హెచ్.ఎం.డి.ఏ నేతృత్వంలో పంపిణీ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణేష్ విగ్రహాలను పూజించాలని ప్రెస్ క్లబ్ పాలకమండలి విజ్ఞప్తి చేసింది.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

సంపాదకీయం

మనిషిని బట్టి మారుతున్న న్యాయం



మానవుడి జీవితంలో విలువైనవి ఏమంటే విద్య, ఆరోగ్యం వాటి తర్వాత డబ్బు. ప్రస్తుత కాలంలో డబ్బున్న వాడు కోట్లకు పడగెత్తడానికి ఎన్నో రకాల దుర్మార్గాలకు పాల్పడుతున్నాడు. కానీ సామాన్యుడికి మాత్రం అది సంపాదించడం ప్రతిరోజు సమస్యగా పరిణమించుతున్నది. ఆర్థిక సంస్థలైన బ్యాంకులు, జీవిత బీమా సంస్థలు కూడా పేదవాడిని చిన్నచూపు చూస్తాయి, పెద్దవాళ్లను అక్కున చేర్చుకుంటాయి. వాళ్లకు బడా పార్టీల నుండి కోట్ల రూపాయల డిపాజిట్లు అవసరం కావచ్చు. కానీ ప్రతిరోజు బ్యాంకులద్వారా చిన్నచిన్న లావాదేవీలు జరిపే సామాన్యుడు కూడా ముఖ్యమే. అయితే ఈ విషయంలో ప్రభుత్వం కూడా వివక్ష చూపిస్తుంది. బడా పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలపట్ల ఉదారంగా వ్యవహరిస్తుంది. మామూలు వ్యక్తి పట్ల కర్కశంగా ప్రవర్తిస్తున్నది. ఎన్‌సిఎల్‌టి నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ 2016లో ఏర్పడిన ఒక ప్రాధికార సంస్థ. కార్పొరేట్ సంస్థలకు వచ్చే సివిల్ తగవులను రుణ సంబంధ సమస్యలను తీర్చుతుంది. జీ గ్రూప్ సంస్థల అధినేత సుభాష్ చంద్ర తాను ప్రత్యక్షంగా బ్యాంకుల నుండి రుణం తీసుకోకపోయినా 22,657 కోట్ల రూపాయల రుణానికి తన జేబు సంస్థ ఎస్‌ఎల్ గ్రూపు వారికి గ్యారెంటర్‌గా అంటే వ్యక్తిగత పూచీకత్తుగా సంతకం చేశాడు. తీసుకున్న రుణం తీర్చలేని పరిస్థితుల్లో సుభాష్ చంద్ర ఆ మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుంది. ఈ విధంగా ఆ గ్రూపుకు రుణం ఇచ్చిన వారిలో జీవిత బీమా సంస్థ కెనరా, యూనియన్, ఆక్సిస్, హెచ్‌డిఎఫ్ సి బ్యాంకులు ఉన్నాయి ఎస్‌ఎల్ గ్రూపు తాను దివాలా తీసినట్లు ప్రకటించి తన రుణ విషయమై ఎన్‌సిఎల్‌టి సెటిల్మెంట్ కోరింది. మొన్న ఆగస్టు 26 నాడు ఎన్‌సిఎల్‌టి సంస్థ సమావేశమై ఆ రుణం మొత్తాన్ని రద్దు చేస్తూ సుభాష్ చంద్ర వద్ద ఉన్న కేవలం 6.25 కోట్ల రూపాయలు చెల్లిస్తే సరిపోతుందని తీర్పు ఇచ్చింది. మరొక పాతిక లక్షల రూపాయలు ఖర్చుల నిమిత్తమై చెల్లించాలి. సుభాష్ తన ఖాతాలో అంతకుమించి డబ్బులు లేవని చూపించాడు. దాంతో 99.97% రుణాన్ని రద్దు చేస్తూ కేవలం 0.03% చెల్లిస్తే సరిపోతుందని ఎన్‌సిఎల్‌టి సెటిల్మెంట్ తీర్పు చెప్పింది. ఇందుకు సభ్యుల్లో 80.81 శాతం అనుకూలంగా ఓటు వేయడం ఆశ్చర్యకరం. రుణదాతలైన ఎల్‌ఐసి, ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు అన్నీ వ్యతిరేకించినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు వారు కోర్టుకు వెళ్లే ఆలోచనతో ఉన్నారు. ఎన్‌సిఎల్‌టికి కార్పొరేట్ సంస్థలపై ఎందుకింత ప్రేమ? సుభాష్ బిజెపి ఎంపి కావడం వల్లనేనా? పారిశ్రామికవేత్తలకు, మీడియా దిగ్గజాలకు, కార్పొరేట్ సంస్థలకు ఎర్రతివాచిపరచి వారి వందల వేల కోట్ల రుణాలు కొట్టివేస్తూ ఇస్తున్న తీర్పులు దేశంలో సగటు మనిషిని ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నాయి. పేదవాడు లేదా సామాన్యుడు ఒక నెల ఇఎంఐ కట్టకపోయినా లేదా ఆలస్యమైనా జరిమానా వేయడం, జప్తులు చేయడం లాంటివి చేసే బ్యాంకులు బడాబాబుల వద్ద చేతులెత్తేస్తున్నాయి, మోకరిల్లుతున్నాయి. నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నాయి. అసలు ఈ రుణమాఫీ సెటిల్మెంట్ కూడా చాలా వ్యూహాత్మకంగా జరిగినట్లు తెలుస్తోంది. ఆయనకు అనుకూలంగా ఓటు వేసిన 80.81 శాతం మందిలో 60 శాతం మంది ఆయన గ్రూపు కంపెనీల సభ్యులే. వారు సహజంగానే సుభాష్ చంద్ర రుణమాఫీకి అనుకూలంగానే ఓటు వేసి తమ మద్దతు తెలిపారు. వ్యతిరేకించిన వారిలో కేవలం ఎల్‌ఐసి, ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులు. అవి ఈ రకమైన వేల కోట్ల నష్టం భరించడానికి సిద్ధంగా లేవు. అందుకే అవి న్యాయం కోసం కోర్టుల తలుపు తట్టబోతున్నాయి. ఒక సంవత్సరం క్రితం పారిశ్రామికవేత్త మాజీ ఎంపి టి సుబ్బరామిరెడ్డి విషయంలో కూడా ఎన్‌సిఎల్‌టి ఇదే విధంగా ప్రవర్తించింది. ఆయన గాయత్రీ ప్రాజెక్టుల అధినేత. ఆ సంస్థ అప్పుల్లో కూరుకుపోయిందని సిబ్బందికి జీతాలు చెల్లించే పరిస్థితి లేదని చెప్పి దివాలా తీసినట్లు బ్యాంకులకు తెలిపింది. బ్యాంకుల నుండి రూ. 8100 కోట్ల రుణం తీసుకోగా ఎన్‌సిఎల్‌టి మాత్రం రూ. 5700 కోట్లు మాఫీ చేస్తూ కేవలం రూ. 2400 కోట్లు చెల్లిస్తే చాలు అంటూ వన్ టైం సెటిల్మెంట్ కింద తీర్పు చెప్పింది. రుణాలు ఇచ్చిన కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిస్సహాయంగా తీర్పును అమలు చేశాయి. సామాన్యుడికి సెక్యూరిటీ మొత్తం పై 80% మాత్రమే రుణం మంజూరు చేసే బ్యాంకులు 8100 కోట్లు మంజూరు చేసేటప్పుడు ఏ సెక్యూరిటీ పెట్టుకో లేదా ఎందుకింత పక్షపాతం? ఇది కేవలం బడా బాబుల వరకే పరిమితమా? లిక్కర్ డాన్ విజయ్ మాల్యా విషయంలోనూ అదే జరిగింది. విదేశాలలో విలాసాలలో మునిగితేలుతున్న మాల్యాను కనీసం మన దేశానికి కూడా తిరిగి రప్పించలేక పోతున్నాయి మన చట్టాలు. పైగా తాను రూ. 6,203 కోట్ల రూపాయలు బాకీ పడితే తన నుండి రూ. 14,100 కోట్లు వసూలు చేశారని మాల్యా ఆరోపిస్తున్నాడు, వాపోతున్నాడు. సామాన్యుడి ప్రతి పైసాకు వడ్డీతో సహా ముక్కుపిండి వసూలు చేసే బ్యాంకులు పలుకుబడి గల పెద్ద మనుషుల విషయంలో చాలా ఉదారంగా ప్రవర్తించడం దారుణం. చివరకు ఈ ఎగవేయబడ్డ లేక అధికారికంగా రుణమాఫీ అయిన డబ్బు మొత్తం పేదలకు భారం అవుతుంది. వారు అందించే ప్రతి సర్వీసుకు చార్జీలు పెంచి వినియోగ దారుడిపై అదనపు భారం వేస్తారు. అంటే బడా బాబులు ఎగ్గొట్టే డబ్బులు పేదలు చెల్లించాల్సి వస్తుందన్నమాట. ఎన్‌సిఎల్‌టి ధర్మాసనం –ఐదుగురు సభ్యులతో కూడిన బెంచ్ మొదటి సెటిల్మెంట్ తీర్పును తాత్కాలికంగా నిలిపివేసింది. కానీ భవిష్యత్తులో ఆ బెంచ్‌పై ఎన్ని రాజకీయ ఒత్తిడులు ఉంటాయో, అది ఏ రకమైన సెటిల్మెంట్ చేస్తుందో వేచిచూడాల్సిందే. ప్రధాన ప్రతిపక్షం మాత్రం బ్యాంకులకు బాగా గుండు కొట్టించారంటూ వ్యాఖ్యానించింది. ఒక మాల్యా, ఒక సుబ్బరామిరెడ్డి, ఒక సుభాష్ చంద్ర వేల కోట్ల రూపాయలు ఎగవేత వేస్తూ బ్యాంకుల ఆదాయానికి గండి కొడుతుంటే ఆర్థిక శాఖ మంత్రి నిర్మలమ్మ నిమ్మకు నీరెత్తినట్లుంది. ఇంకా ఏ ఏ బ్యాంకులు విలీనం చేయాలా అని, జీవిత బీమా సంస్థలో ఇంకా ప్రైవేటు పెట్టుబడులు ఎలా ప్రోత్సహించాలని ఆలోచిస్తున్నట్లు ఉంది. పేదవారికి, చిరుద్యోగులకు రుణాలు మంజూరు చేయాలంటే గ్యారెంటర్లు కావాలి. అనేక నియమాలు అడ్డొస్తాయి.కానీ పెద్ద వారి విషయంలో అవన్నీ అవసరం లేకుండానే రుణాలు మంజూరు అవుతాయి. నియమాలను తుంగలో తొక్కుతారు. ఒక రైతు అప్పు కోసం బ్యాంకుకు చెప్పులరిగేలా అధికారులు తిప్పుకోవడం చూస్తుంటాం. కార్పొరేట్లకు మాత్రం ఎర్రతి వాచీపరచి గ్యారంటీలు లేకుండా కూడా వేల కోట్లు రుణం మంజూరు చేయగలరు. వడ్డించేవాడు మనవాడైతే పంక్తి చివరన కూర్చున్నా రావలసినవన్నీ వస్తాయేమో!

సంక్లిష్టతల్లో బ్రిక్స్ శక్తి ఎంతవరకు?



న్యూఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో బ్రిక్స్ 18వ వార్షిక సదస్సుకు భారీ ఎత్తున సర్వసన్నాహాలు సిద్ధమయ్యాయి. 2009లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనాలతో ప్రారంభమైన ఈ కూటమిలో 2011లో దక్షిణాఫ్రికా చేరింది. ప్రస్తుతం ఈ కూటమిలో జిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు కూడా భాగస్వామ్యం వహిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో దాదాపు సగం మంది ఈ కూటమికి వర్తించడం విశేషం. అలాగే కొనుగోలు శక్తి సమానత్వం ఆధారంగా ప్రపంచ జిడిపిలో సుమారు 40శాతం ఈ కూటమి దేశాలదే అని అంచనాలు చెబుతున్నాయి. ఇంత విస్తృత సామర్థం కలిగిన ఈ కూటమి తగినంత ప్రభావాన్ని చూపడం లేదు. బ్రిక్స్ తాను ఏ రూపంలో ఉండాలనుకుంటుందో ఇంకా స్పష్టంగా నిర్ణయించుకోలేకపోతోంది. ఒక బలమైన కూటమిగా ఉండాలా? చర్చల్లో ఒత్తిడి తెచ్చే సాధనంగా ఉండాలా? లేక ఇంకా నెరవేరని బహుళ ధ్రువ ప్రపంచం కోసం ఎదురు చూసే వేదికగా ఉండాలా? అన్న ప్రశ్నలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.ఇప్పుడు సదస్సు జరుగుతున్న సమయం చూస్తే చాలా సంక్లిష్టమైన వాతావరణం కనిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుతనం, ఆకస్మిక దౌత్య విధానాల వల్ల బ్రిక్స్ కూటమి లోని కొన్ని సభ్యదేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాట వాస్తవం. అసలు బ్రిక్స్ ఏర్పాటులో ప్రధాన ఉద్దేశం పాశ్చాత్య దేశాల ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా అనేక దేశాలు కలిసి సంఖ్యాబలంతో తమ శక్తిని పెంచుకోవడం. అయితే ఇప్పటివరకు ఇది అగ్నిపరీక్షగానే ఉంటోంది. అయితే భారత్ ఈ సదస్సును కేవలం ఆతిథ్యం ఇచ్చే బాధ్యతగా మాత్రమే కాకుండా దౌత్యపరంగా ఎంతో ముఖ్యమైన అవకాశంగా భావిస్తోంది. మధ్యప్రాచ్యం, ఐరోపాలో కొనసాగుతున్న యుద్ధాల కారణంగా అంతర్జాతీయ దౌత్య పరిస్థితులు అత్యంత క్లిష్టంగా మారిన సమయంలో సదస్సుకు ముందు కొన్ని వారాల క్రితమే భారత్ చురుకైన దౌత్య ప్రయత్నాలు ప్రారంభించింది. ఆగస్టు 24న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ప్రధాని నరేంద్ర మోడీ వ్యక్తిగత సందేశాన్ని రష్యా అధ్యక్షులు పుతిన్‌కు అందించేందుకు క్రెమ్లిన్ వెళ్లారు. మరుసటి రోజు ఆగస్టు 25న, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ తో సమావేశమయ్యారు. ఆగస్టు 31న కిర్గిజిస్థాన్ లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సు సందర్భంగా మన ప్రధాని మోడీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు. అలాగే ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో కూడా చర్చలు జరిపారు. పెజెష్కియాన్ హాజరు కావడం ద్వారా అమెరికా చేస్తున్న కొన్ని వాదనలకు భిన్నంగా, ఇరాన్ రాజకీయ నాయకత్వ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోందన్న సూచనలు కనిపించాయి. ఈ సదస్సును రష్యా, చైనా, ఇరాన్ వంటి దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి, క్లిష్టమైన అంతర్జాతీయ పరిస్థితుల్లో తన దౌత్యపరమైన ప్రభావాన్ని పెంచుకోవడానికి భారత్ ఉపయోగించుకుంటుంది. అయితే ఈ ప్రయత్నాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. బ్రిక్స్ ఏర్పడినప్పటి నుంచి సభ్యదేశాల మధ్య ఉన్న విభేదాల కారణంగా అది అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఎందుకంటే సభ్యదేశాల ప్రయోజనాలు చాలా సందర్భాల్లో ఒకదానితో మరొకటి సరిపోలవు. భారత్, చైనాలకు ఎప్పటి నుంచో పరస్పరం పోటీ పడే వ్యూహాత్మక ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే కొన్ని సభ్యదేశాలు చైనా ఆర్థిక ఆధిపత్యంపై ఆందోళనతో ఉన్నాయి. 2022 నుంచి ఈ పరిస్థితిలో కీలకమైన మలుపు వచ్చింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి కారణంగా పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షలు విధించినప్పుడు బ్రిక్స్ దేశాలు తమ నియంత్రణలో లేని ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎంతగా ఆధారపడి ఉన్నాయో స్పష్టమైంది. ఒక ప్రత్యర్థి శక్తిపై ఆంక్షలు విధించడం వల్ల, అమెరికా నియంత్రణకు బయటగా ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాలు, బ్యాంకింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం స్పష్టమైంది. అయినప్పటికీ బ్రిక్స్ కూటమి ప్రధాన దృష్టి రాజకీయాలపై కాకుండా, ఆర్థిక, సాంకేతిక అంశాల పైనే కొనసాగుతోంది. భవిష్యత్తులో కూడా బ్రిక్స్ ప్రధానంగా వాణిజ్యం, ఆర్థిక వ్యవహారాలు, స్థిరమైన అభివృద్ధి వంటి అంశాల పైనే దృష్టి కేంద్రీకరించే అవకాశం కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ఇరాన్‌పై అమెరికా చేసిన సైనిక దాడులను అధికారికంగా ఖండించాలని ఇరాన్ కోరుతోంది. అయితే ఈ డిమాండ్‌పై బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం లేదు. యుద్ధ చర్యలను పూర్తిగా నిలిపివేయాలని, విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని కోరుతూ వెలువడనున్న ప్రాథమిక ప్రకటనపై సభ్యదేశాలు ఎంతవరకు ఏకీభవిస్తాయో చూడాల్సిందే. బ్రిక్స్‌లో రష్యా చైనా ఇరాన్ ప్రభావం పెరుగుతోంది. కానీ భారత్ మాత్రం పాశ్చాత్య దేశాల తోనూ, ఇజ్రాయెల్ తోనూ సంబంధాలు కొనసాగిస్తోంది. కాబట్టి బ్రిక్స్ కూటమిలో తన స్థానం, తన స్వతంత్ర విదేశాంగ విధాపం. పాశ్చాత్య దేశాలతో సంబంధాలు ఈ మూడింటినీ భారత్ ఎలా సమతుల్యం చేస్తుందనేదే ప్రధాన సమస్య. భారత్ అమెరికా వైపు, లేదా చైనా, రష్యా వైపు పూర్తిగా మొగ్గు చూపకుండా తన ప్రయోజనాలకు అనుగుణంగా ప్రతి దేశంతో వేర్వేరు అంశాల్లో కలిసి పనిచేయాలన్న వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని అనుసరిస్తోంది. బ్రిక్స్ తన ప్రాముఖ్యతను కోల్పోకుండా ఉండాలంటే భారత్ ఎంతో సమర్థంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. బ్రిక్స్ భవిష్యత్తులో నిజంగా ఎంత శక్తివంతమైన కూటమిగా మారగలదో సభ్యదేశాల వైఖరిపై ఆధారపడి ఉంటుంది.

సోషల్ మీడియా ఉచ్చులో చిన్నారులు



అరచేతిలో ప్రపంచంగా మారిన ఆధునిక సాంకేతికతతో ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో, అన్ని దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా మైనర్ల చేతిలో సోషల్ మీడియా విశృంఖలకు పరిమితులు లేకుండా పోతున్నాయి. వేగవంతమైన ప్రస్తుత ఆధునిక కాలంలో పిల్లల చదువులకు కేరాఫ్‌గా మారిన సోషల్ మీడియా కొన్ని సందర్భాల్లో పక్కదారి పడుతుండడంతో ఆందోళన పరిస్థితులు నెలకొంటున్నాయి. ముఖ్యంగా అత్యాధునిక ఎఐ సాంకేతికత దూకుడుతో ఆలోచన విధానాలు తగ్గిపోవడమే కాకుండా మానవత్వం పరిమితులు కూడా చెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాకు సంబంధించి పిల్లల వినియోగంపై కట్టడి చేసేలా నిబంధనలు విధించాలనే చర్చ సర్వత్రా ప్రారంభమైంది. స్మార్ట్ ఫోన్ ఇప్పుడు పిల్లల చదువులో కీలక భాగమైంది. విద్యా సంస్థల రోజువారీ కార్యక్రమాలు మొదలుకొని ఆన్‌లైన్ తరగతులు, సమాచార సేకరణ వరకు అన్నింటా డిజిటల్ ప్రపంచం వారికి ఎన్నో వసతులు అందిస్తోంది. అదే సమయంలో సోషల్ మీడియా, షార్ట్ వీడియోలు, సినిమాలు, ఆన్‌లైన్ గేమ్స్, చాట్ ప్లాట్‌ఫామ్‌లు పిల్లల జీవిత్వా చూపిస్తున్న దుష్ప్రభావం ఆందోళన కలిగిస్తోంది.

అశ్లీల చిత్రాలే కాకుండా ఒక వ్యక్తిని ఎలా చంపాలనే విషయాలను కూడా సోషల్ మీడియాలో చూస్తుండడం దురదృష్టకరం. ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ నిర్వీర్యమై న్యూక్లియర్ ఫ్యామిలీలుగా మారుతున్న నేటి సమాజంలో పిల్లలు వినోదం పేరుతో గంటల తరబడి ఫోన్లకు అతుక్కుపోవడం, నిద్రాహార వేళలు మారడం, చదువుపై ఆసక్తి తగ్గిపోవడం, వ్యక్తిగత సమాచార దుర్వినియోగమవడం, సైబర్ వేధింపులు, లైంగిక వేధింపులు పెరిగిపోవడం. ఆశ్లీల చిత్రాలపై ఆసక్తి పెరగడం వంటి సమస్యలు నేడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నాయి. పిల్లలకు షోషల్ మీడియా చేరువకాకుండా కఠిన నిర్ణయం తీసుకోవాలనే డిమాండ్లు ప్రపంచవ్యాప్తంగా వెలువెత్తుతున్నాయి. సోషల్ మీడియాను నియంత్రించాలనే డిమాండ్ వెనుక తీవ్రమైన పరిస్థితులు నెలకొన్నాయని గణాంకాలు నిరూపిస్తున్నాయి. యునిసెఫ్ తాజా అధ్యయనం ప్రకారం 21 దేశాల్లో 12–17 ఏళ్ల మధ్య వయసున్న సుమారు రెండు కోట్ల మంది పిల్లలు ఏడాది వ్యవధిలో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా లైంగిక వేధింపులకు గురైనట్లు అంచనాలున్నాయి. చిన్నారులు అనుచిత లైంగిక కంటెంట్‌తో లైంగిక సంభాషణలకు, చిత్రాలకు ప్రేరేపితమవుతున్నారు. ఇలాంటి ఘటనల్లో దాదాపు 60 శాతం ప్రధాన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపైనే చోటుచేసుకోవడం గమనార్హం. మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే వీటికి సంబంధించి ఒక శాతం కంటే తక్కువ ఘటనలే ఫిర్యాదులుగా నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా సోషల్ మీడియా వినియోగంపై పలు హెచ్చరికలు జారీ చేస్తోంది. కొన్ని నివేదికల ప్రకారం 44 దేశాల్లో సుమారు 2.80 లక్షల మంది యువతపై నిర్వహించిన అధ్యయనంలో సమస్యాత్మక సోషల్ మీడియా వినియోగం 2018లో ఏడు శాతం ఉండగా, 2022 నాటికి 11 శాతానికి పెరిగింది. ఈ లెక్కలు 2026 నాటికి మరింత పెరగడం ఖాయం. నియంత్రణ కోల్పోవడం, సోషల్ మీడియా అందుబాటులో లేకపోతే అసహనం, ఇతర కార్యకలాపాలను నిర్లక్ష్యం చేయడం వంటి లక్షణాలను సమస్యలుగా అధ్యయనంలో పరిగణించారు. నిద్ర, మానసిక ఆరోగ్యం, సామాజిక సంబంధాలపై కూడా దీని ప్రభావం ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలకు సోషల్ మీడియా నియంత్రణపై పలు దేశాలు చర్యలు తీసుకుంటున్నాయి. మంచికి ఉపయోగపడాల్సిన సోషల్ మీడియా చెడు వ్యసనాలకు వేదికవుతున్న నేపథ్యంలో పిల్లల ఆన్‌లైన్ భద్రతకు సంబంధించి పలు దేశాలు కఠిన నిర్ణయాల దిశగా అడుగులు వేస్తున్నాయి. 18 ఏళ్లలోపు పిల్లలు నగ్నచిత్రాలను తీసుకోవడం, చూడటం, ఇతరులకు పంపించడాన్ని సాంకేతికంగా అడ్డుకునేలా మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాల్లోనే భద్రతా వ్యవస్థలను తప్పనిసరి చేసే దిశగా బ్రిటన్ ప్రభుత్వం తాజాగా చట్టం తీసుకురానుంది. పిల్లలు యాపులలోనూ నగ్న కంటెంట్‌ను నిరోధించే చర్యలను వారు పరిశీలిస్తున్నారు. ఆస్ట్రేలియా ఇప్పటికే 16 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వినియోగంపై కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఫ్రాన్స్‌లోనూ 15ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వినియోగాన్ని పరిమితం చేసే ప్రయత్నాలు జరిగాయి. అమెరికాలోనూ పిల్లల వయసు నిర్ధారణ, రాత్రి వేళల్లో వినియోగ పరిమితులు, నోటిఫికేషన్ల నియంత్రణ వంటి అంశాలపై ఒత్తిడి పెరుగుతోంది. మలేషియా, ఇండోనేషియా, న్యూజిలాండ్, స్పెయిన్, పోర్చుగల్ దేశాల్లో 16 ఏళ్ల లోపు వారు, టర్కీ, గ్రీస్, యుఎఇ దేశాల్లో 15 ఏళ్లలోపు వారు సోషల్ మీడియా వినియోగంపై నిబంధనలున్నాయి. భారత దేశంలో పలు రాష్ట్రాలు పిల్లలకు సోషల్ మీడియా నియంత్రణపై మార్గాలను అన్వేషిస్తున్నాయి. సోషల్ మీడియా వినియోగంపై పాఠశాలలు, విద్యాసంస్థల్లో అవగాహన, కౌన్సెలింగ్ వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. కర్ణాటక ప్రభుత్వం 16 ఏళ్లలోపు వారు సోషల్ మీడియా వినియోగాన్ని నిషేధించే నిర్ణయంపై అడుగులు వేస్తుండడం రాష్ట్ర స్థాయిలో వచ్చిన అత్యంత కఠినమైన ప్రతిపాదనల్లో ఒకటిగా నిలిచింది. కర్ణాటక ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని త్వరలో అమలు చేసి స్ఫూర్తిగా నిలిస్తే, ఇతర రాష్ట్రాలు కూడా ఆ దిశగా పయనించవచ్చు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వయసు ఆధారిత విధానం ఆలోచిస్తూ 13 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా ప్రవేశాన్ని పరిమితం చేయడంతోపాటు 13– 16 ఏళ్ల మధ్య వారికి వేర్వేరు నియంత్రణలు తీసుకురావాలని పరిశీలిస్తోంది. వయసును ధ్రువీకరించేందుకు డిజిటల్ ఏజ్ టోకెన్ల వంటి సాంకేతిక పరిష్కారాలను ఎపి ప్రభుత్వం పరిశీలిస్తుంది. గోవా, మహారాష్ట్ర ప్రభుత్వాలు పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై వయసు ఆధారిత నియంత్రణలపై అధ్యయనం చేస్తున్నాయి. తెలంగాణలో దీనికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయాలు వెలువడకపోయినా ఆన్‌లైన్ బాలల లైంగిక దోపిడీ కేసులపై పోలీసు వ్యవస్థ చర్యలు చేపడుతోంది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపడుతున్న దాడుల్లో ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్ వంటి వేదికలను నేరగాళ్లు ఉపయోగిస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సంయుక్తంగా పిల్లలపై జరుగుతున్న ఆన్‌లైన్ అశ్లీల వీడియోల ప్రచారం, సైబర్ మోసాలపై వరుసగా ప్రత్యేక ఆపరేషన్లు చేపట్టాయి. జూన్ 18, 2025న హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ఏకకాలంలో దాడులు చేసి, చైల్డ్ సెక్సువల్ పై 15 మందిని అరెస్ట్ చేసి, 34 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. సోషల్ మీడియాను పిల్లల నుంచి పూర్తిగా దూరం చేయడమా? లేక దాన్ని సురక్షితంగా ఉపయోగించేలా చేయడమా? అనేది కీలకంగా మారుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల తాజా చర్యలు రెండో మార్గానికే ఎక్కువ ప్రాధాన్యతిస్తున్నాయి. పిల్లల చేతిలోని స్మార్ట్ ఫోన్లను లాక్కోవడం కంటే, వారి చేతిలో ఉన్న డిజిటల్ ప్రపంచానికి భద్రతా కవచం ఏర్పాటు చేయడం ప్రభుత్వాలు, టెక్నాలజీ సంస్థలు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల సంయుక్త బాధ్యతలుగా మారబోతున్నాయి.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

అధికారుల స్పందన కరువు.. ప్రజలే ప్రశ్నించాలా?

-అధిక ధరలకు మద్యం విక్రయాలపై ఆరోపణలు.. సిండికేట్ దందాకు చెక్ పెట్టేదెవరు?

--క్వార్టర్‌పై రూ.20 వరకు అదనం.. బెల్ట్ దుకాణాల్లో రూ.40 వరకు వసూళ్లంటూ ఆరోపణలు

-పల్లెల్లో ఆటోల ద్వారా మద్యం విక్రయాలంటూ విమర్శలు.. ఇకనైనా అధికారులు కదలాల్సిందే



సింగరేణి ప్రతినిధి, సెప్టెంబర్ 11 (వార్త సంధ్య): కారేపల్లి మండలంలో మద్యం విక్రయాలపై సిండికేట్ వ్యవస్థ నడుస్తోందన్న ఆరోపణలు పెరుగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించాలన్న డిమాండ్ ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మద్యం విక్రయించాల్సి ఉండగా, అదనపు ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్వార్టర్ బాటిల్‌పై రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, బెల్ట్ దుకాణాల్లో రూ.40 వరకు అధికంగా తీసుకుంటున్నారని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ఒకటైతే అదనంగా ఎందుకు వసూలు చేస్తున్నారంటూ వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు పల్లెల్లోకి ఆటోల ద్వారా మద్యం తరలించి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అనధికారిక మద్యం విక్రయాలపై అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. మద్యం విక్రయాలపై పలు ఆరోపణలు వస్తున్నప్పటికీ తనిఖీలు, చర్యలు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిజానిజాలు తేల్చాలని కోరుతున్నారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తే వినియోగదారులు బిల్లు కోరాలని, అనధికారిక విక్రయాలపై ఆధారాలతో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని పలువురు సూచిస్తున్నారు. ఎవరితోనూ గొడవలకు దిగకుండా చట్టబద్ధమైన మార్గాల్లో సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొంటున్నారు. కారేపల్లి మండలంలో మద్యం విక్రయాలపై వస్తున్న ఆరోపణలను ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని, సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకుని, అధిక ధరల వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

-మునుగోడులో ఘనంగా మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక



మునుగోడు:, సెప్టెంబర్- 11: (వార్త సంధ్య) విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ అన్నారు.మునుగోడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు, క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడల కన్వీనర్, మండల విద్యాధికారి తల్లమల్ల మల్లేశం, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్, ప్రధానోపాధ్యాయులు కే. బాల ప్రసాద్ తదితరులు క్రీడా పోటీలను ప్రారంభించారు.మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ స్వయంగా తమ సొంత ఖర్చులతో మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో పలువురు తమ వంతు సహకారం అందించారు. మునుగోడు ఎస్సై శోభన్ బాబు క్రీడా ప్రాంగణంలో టెంట్, మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం కోసం మునుగోడుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముచ్చపోతుల శ్రీనివాస్ రూ.3,000, 9వ వార్డు సభ్యుడు పందుల రంజిత్ రూ.3,000 అందజేశారు.మునుగోడు పీడీ విద్యాసాగర్ పర్యవేక్షణలో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ కొనసాగింది. మండల విద్యాధికారి తల్లమల్ల మల్లేశం, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కే. సత్తిరెడ్డి, వివిధ పాఠశాలల పీడీలతో కలిసి ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం సర్పంచ్ రమాదేవి నరసింహ గౌడ్ విద్యార్థులకు బహుమతులు, మెడల్స్ అందజేశారు.క్రీడా పోటీలకు సహకరించిన సర్పంచ్ రమాదేవి నరసింహ గౌడ్, ఎస్సై శోభన్ బాబు, గ్రామస్తులు, నాయకులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు విద్యాసాగర్, సుధాకర్ రెడ్డి, బాలరాజు యాదవ్, మధుకుమార్, గణేష్, శ్రీలత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరి వృత్తిదారుల ఐక్యతకు మరో ముందడుగు

నల్లగొండలో కుమ్మరి వృత్తిదారుల జిల్లా కమిటీ ఎన్నిక..... పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపు



నల్గొండ: సెప్టెంబర్ -11 (వార్త సంధ్య) నల్లగొండ: జిల్లాలోని కుమ్మరి వృత్తిదారులను సంఘటితం చేసి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే దిశగా నల్లగొండ జిల్లా వృత్తిదారుల విభాగం జిల్లా కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షుడు, పూర్తి కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు నల్లగొండ పట్టణంలోని మైసూర్‌నగర్ (కుమ్మరివాడ)లో రాష్ట్ర, నల్లగొండ జిల్లా కన్వీనర్ రాదరపు బిక్షపతి అధ్యక్షతన ఈ ముఖ్య సమావేశం జరగనుంది.

నల్లగొండ జిల్లా కుమ్మరి కులస్తులు, సంప్రదాయ కుమ్మరి వృత్తిదారులు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరై తమ సహకారాన్ని అందించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. తరతరాలుగా కుమ్మరి వృత్తిని జీవనోపాధిగా కొనసాగిస్తున్న వృత్తిదారుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సంప్రదాయ వృత్తులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వృత్తిదారులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా కుండలు, మట్టి పాత్రలు, ఇతర మట్టి ఉత్పత్తులను తయారు చేస్తూ సంప్రదాయ కుమ్మరి వృత్తిని కొనసాగిస్తున్న ఉత్సాహవంతులైన వృత్తిదారులు సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని కోరారు. అలాగే జిల్లా వృత్తిదారుల విభాగం కమిటీలో బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి ఉన్నవారు కూడా ఈ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ సంప్రదాయంగా కుమ్మరి వృత్తిని కొనసాగిస్తున్న ప్రతి వృత్తిదారుడికి ఈ సమాచారం చేరేలా చూడాలని, వారందరినీ సమావేశానికి హాజరయ్యేలా ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు. కుమ్మరి వృత్తిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వృత్తికి అవసరమైన ముడి పదార్థాల లభ్యత, తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు, ఆర్థిక సహాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన వంటి అంశాలపై భవిష్యత్తులో సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వృత్తిదారుల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికి అందేలా చూడడం, సంప్రదాయ వృత్తిని కొనసాగించే కుటుంబాలకు ప్రోత్సాహం కల్పించేలా కృషి చేయడం వంటి కార్యక్రమాలకు కమిటీ ద్వారా ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా కుమ్మరి వృత్తిదారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యలను చర్చించడంతో పాటు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించేందుకు, ఈ సమావేశం ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల వారీగా వృత్తిదారులను సంఘటితం చేసి, వారి సమస్యలను నమోదు చేసుకుని, అవసరమైన సమయంలో సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కమిటీ పనిచేయాలని ఆకాంక్షించారు. యువత కూడా సంప్రదాయ వృత్తి పట్ల ఆసక్తి పెంచుకుని, ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకునేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కుమ్మరి వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి ఐక్యతే ప్రధాన బలమని, వ్యక్తిగతంగా కాకుండా సమిష్టిగా ముందుకు సాగితేనే హక్కులను సాధించుకోవడం సాధ్యమవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా ప్రతి గ్రామానికి చెందిన కుమ్మరి కులస్తులు, వృత్తిదారులు ఈ సమావేశాన్ని తమ కార్యక్రమంగా భావించి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. జిల్లా వృత్తిదారుల విభాగం కమిటీ ఎన్నిక విజయవంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కుమ్మరి వృత్తిదారుల ఐక్యతే మన బలం.. మన హక్కుల సాధనకు సంఘటిత పోరాటమే మార్గం అని నిర్వాహకులు పేర్కొంటూ, శనివారం ఉదయం 10 గంటలకు మైసూర్‌నగర్ (కుమ్మరివాడ), నల్లగొండలో జరిగే జిల్లా కమిటీ ఎన్నిక కార్యక్రమానికి అందరూ తప్పక హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరించొద్దు

బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు వల్లపూర్ రెడ్డి రవీందర్ రెడ్డి డిమాండ్



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) సెప్టెంబర్ 11. : సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూపాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విద్యార్థులకు వ్యతిరేకంగా ఉన్న 97 జీవోను తొలగించాలని డిమాండ్ చేశారు గత కొన్ని రోజులుగా ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి విద్యార్థుల సమస్యను పరిష్కరించడం లేదని ఆయన ఆరోపించారు న్యాయమైన విద్యార్థుల డిమాండ్ పరిష్కరించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు బహుజన రాజ్యం పార్టీ జాతీయ అధ్యక్షుడు రామావత్ లాలూ నాయక్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థి సమస్యల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన కమిటీ ఇంతవరకు సమస్యను పరిష్కరించడం లేదని ఆయన ఆరోపించారు తక్షణమే ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి ముఖ్యమంత్రి కృషి చేయాలని ఆయన కోరారు విద్యార్థుల పక్షంగా ఉండి పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు ఈ సమావేశంలో మూడవత్ అశోక్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణ పరిష్కరించాలని ప్రవేటు యూనివర్సిటీకి కింద తేవద్దని ఆయన కోరారు విద్యార్థుల పక్షాన ఉండి ఎప్పుడు పోరాటం చేస్తామని విద్యాశాఖ సమావేశం పరిష్కరించే వరకు తమ ఉద్యమం ఆగదని ఆయన హెచ్చరించారు ఈ సమావేశంలో పలువురు విద్యార్థి సంఘం నేతలు పాల్గొని ప్రసంగించారు

కన్నులపండువగా శ్రీ కామాక్షి అమ్మవారి అలంకారం



వార్తా సంధ్యా కూకట్‌పల్లి శ్రావణ మాస శుభ సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీ చక్రాధిష్ఠాన కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు కన్నులపండువగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం నాడు లోక కళ్యాణార్థం, భక్తులందరికీ సౌభాగ్య ప్రాప్తి కలగాలని ఆకాంక్షిస్తూ శ్రీ కామాక్షి అమ్మవారికి విశేష సేవలు జరిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారిని 300 కేజీల పసుపు కొమ్ములతో అత్యంత సుందరంగా, శోభాయమానంగా అలంకరించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ అపూర్వ అలంకారాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. మంగళప్రదమైన పసుపు కొమ్ముల అలంకారంలో దర్శనమిచ్చిన కామాక్షి అమ్మవారిని దర్శించుకుని భక్తులు తారకమంత్ర స్మరణలతో పులకించిపోయారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

8వ జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో పాల్గొన్న బాపట్ల కలెక్టర్, జిల్లా ఎస్పీ



బాపట్ల, జిల్లా బ్యూరో (వార్త సంధ్య) సెప్టెంబర్ 11. అమరావతి లోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 8వ జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సదస్సు రెండవ రోజు సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పటిష్టమైన భద్రతా చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో 'శిరోరక్ష – ప్రాణరక్ష' కార్యక్రమం పోషిస్తున్న ముఖ్య భూమిక తదితర అంశాలను ప్రభుత్వానికి నివేదించారు.

ఈ సమావేశంలో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రత, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

కంటి మందు చుక్కల సీసాలను ఎక్కువ రోజులు వాడుతున్నారా.. జాగ్రత్త!



కంటి సమస్యలకు ఉపయోగించే మందు చుక్కల సీసాపై ఉన్న గడువు తేదీని మాత్రమే చూసి వాటిని నెలల తరబడి ఉపయోగించడం సరికాదని నిపుణులు సూచిస్తున్నారు. సీసాను ఒకసారి తెరిచిన తర్వాత మందు గాలి, పరిసర వాతావరణానికి గురవుతుంది. అంతేకాకుండా సీసా చివరి భాగం కనురెప్పలు, కంటి వెంట్రుకలు లేదా చేతులకు తగిలితే బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు మందులోకి చేరే అవకాశం ఉంటుంది.

నెలరోజుల తర్వాత వద్దు..

సాధారణంగా బహుళ వినియోగ కంటి మందు చుక్కల సీసాను తెరిచిన 28 నుంచి 30 రోజుల్లోపు పడేయాలని నిపుణులు సూచిస్తున్నారు. సీసాపై ముద్రించిన గడువు తేదీ ఇంకా ముగియకపోయినా.. తెరిచిన తర్వాత నిర్ణీత వ్యవధి పూర్తయితే దాన్ని ఉపయోగించకూడదు. మందు కలుషితమైతే దాని ప్రభావం తగ్గడంతోపాటు కంటిలో ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కార్నియాకు కూడా ఇన్ఫెక్షన్ సోకే అవకాశం ఉంది.

ఒక్కసారి వాడే వాటిపై..

సంరక్షక పదార్థాలు లేని ఒక్కసారి ఉపయోగించే చిన్న సీసాలను ఎక్కువకాలం నిల్వ చేయకూడదు. సాధారణంగా వాటిని తెరిచిన 24 గంటల్లోపు పడేయాలని సూచిస్తారు. కొన్ని మందులను తెరిచిన వెంటనే ఉపయోగించి మిగిలిన ద్రావణాన్ని పడేయాల్సి ఉంటుంది. అందువల్ల ఆయా మందులపై తయారీదారు ఇచ్చిన సూచనలను తప్పనిసరిగా పాటించాలి.

తేదీ రాసుకోవడం మంచిది

కంటి మందు సీసాను తెరిచిన వెంటనే ఆ తేదీని సీసాపై రాసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. మందు వేసేటప్పుడు సీసా చివర భాగం కంటికి లేదా ఇతర ఉపరితలాలకు తగలకుండా జాగ్రత్తపడాలి. మందులను సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయడంతోపాటు, వైద్యుడు సూచించిన విధంగానే ఉపయోగించాలి. ముఖ్యంగా గ్లాకోమా వంటి కంటి సమస్యలకు మందులు వాడేవారు ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

కంటి చూపు మసకబారకుండా ఉండాలంటే ఇవి తింటే చాలు.. రెండో రోజు నుంచే కళ్ళద్దాలు తీసేస్తారు...



కంటి చూపు మసకబారకుండా, మయోపియా సమస్యను నివారించడానికి మీ జీవన శైలిలో కొన్ని మార్పులు చేస్తే చాలు. ముఖ్యంగా, తగినంత వెలుతురులో స్క్రీన్లు చూడటం, కళ్లకు చల్లటి గుడ్డలతో సేదదీర్చడం, బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవడం, నేత్ర వ్యాయామాలు చేయడం వలన కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చుకంటి చూపు మసకబారకుండా, మయోపియా సమస్యను నివారించడానికి మీ జీవన శైలిలో కొన్ని మార్పులు చేస్తే చాలు. ముఖ్యంగా, తగినంత వెలుతురులో స్క్రీన్లు చూడటం, కళ్లకు చల్లటి గుడ్డలతో సేదదీర్చడం, బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవడం, నేత్ర వ్యాయామాలు చేయడం వలన కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు .ప్రధానంగా, ఎల్లప్పుడూ తగినంత వెలుతురు ఉన్న ప్రాంతంలోనే స్క్రీన్లను ఉపయోగించడం అలవరచుకోవాలి. రాత్రిపూట చీకటిలో స్క్రీన్లు చూడాల్సి వస్తే, కంటి డాక్టరు సలహా మేరకు "కాంట్రాస్ట్ రిడక్షన్ లెన్సెస్" వాడటం మంచిది. అలాగే, రోజుకు రెండు మూడు సార్లు కళ్ళపై చల్లటి గుడ్డలతో ఐదు నిమిషాల పాటు సేదదీర్చడం కంటి కండరాలను విశ్రాంతి పరుస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది. క్యారెట్, ఆకుకూరలు వంటి బీటా కెరోటిన్, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం కంటి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. వెలుతురులో స్క్రీన్ల వాడకం: సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు వంటి స్క్రీన్లను ఉపయోగించేటప్పుడు ఎల్లప్పుడూ తగినంత వెలుతురు ఉన్న ప్రదేశంలోనే ఉండాలి. గదిలో అన్ని లైట్లు వేసి ఉన్నప్పుడు చూడటం మంచిది. చీకటిలో స్క్రీన్లు చూడటం తప్పనిసరి అయితే, కంటి వైద్యుల సలహా మేరకు "కాంట్రాస్ట్ రిడక్షన్ లెన్సెస్" ఉపయోగించడం వల్ల కంటికి కలిగే నష్టాన్ని తగ్గించుకోవచ్చుచల్లటి గుడ్డలతో కూల్ చేయడం: రోజుకు రెండు మూడు సార్లు, ప్రతిసారీ ఐదు నిమిషాల పాటు కళ్ళపై చల్లటి, తడి గుడ్డలను లేదా టిష్యూ పేపర్లను ఉంచుకోవడం వల్ల కంటి కండరాలకు విశ్రాంతి లభిస్తుంది. స్క్రీన్ల వల్ల కలిగే ఒత్తిడి, సంకోచం తగ్గుతుంది. చల్లటి నీటికి కండరాలు వేగంగా విశ్రాంతి పొందుతాయి, ఇది కళ్ళ మంటలు, నీళ్లు కారడం వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది.

బరువు తగ్గాలనుకునేవారికి ఇవే బెస్ట్ వ్యాయామాలు..!



బరువు తగ్గాలనుకునేవారు ఆహార నియంత్రణతోపాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం చాలా ముఖ్యం. కార్డియో వ్యాయామాలు కేలరీలను ఖర్చు చేయడంలో సహాయపడతాయి. అయితే ఎక్కువ తీవ్రతతో చేసే వ్యాయామమే ఉత్తమమని భావించడం సరికాదని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువకాలం కొనసాగించగలిగే, శరీరంపై అధిక ఒత్తిడి కలిగించని వ్యాయామాలను ఎంచుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

వాకింగ్ బెస్ట్..

బరువు తగ్గేందుకు వాకింగ్ సులభమైన, ప్రభావవంతమైన వ్యాయామాల్లో ఒకటి. కీళ్లపై ఒత్తిడి తక్కువగా ఉండటంతో దీన్ని క్రమం తప్పకుండా చేయవచ్చు. సాధారణ నడకతోపాటు ట్రెడ్‌మిల్‌పై ఇన్‌క్లైన్ వాకింగ్ చేస్తే కేలరీల ఖర్చు పెరగడంతోపాటు కాళ్లు, గ్లూట్స్ కండరాలు చురుకుగా పనిచేస్తాయి. తక్కువ సమయంలో ఎక్కువ కేలరీలు ఖర్చు చేయాలనుకునేవారికి స్టెయిర్‌మాస్టర్ కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

స్విమ్మింగ్, సైక్లింగ్..

స్విమ్మింగ్ మొత్తం శరీరానికి వ్యాయామాన్ని అందించే తక్కువ ప్రభావం కలిగిన కార్డియో. ముఖ్యంగా అధిక బరువు ఉన్నవారికి ఇది మంచి ప్రత్యామ్నాయం. సైక్లింగ్ కూడా కీళ్లపై తక్కువ ఒత్తిడితో ఎక్కువసేపు చేయగలిగే వ్యాయామం. ఇది కాళ్ల కండరాల ఓర్పును పెంచడంలో సహాయపడుతుంది.

పరుగులు, జంప్ రోప్..

పరుగెత్తడం ద్వారా ఎక్కువ కేలరీలు ఖర్చు చేయవచ్చు. అయితే కీళ్లపై ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో అధిక బరువు ఉన్నవారు జాగ్రత్తగా చేయాలి. జంప్ రోప్ కూడా అధిక కేలరీలను ఖర్చు చేయగలిగినప్పటికీ ఇది హై ఇంపాక్ట్ వ్యాయామం కావడంతో ప్రతిరోజూ ఎక్కువసేపు చేయడం అందరికీ అనుకూలం కాదు. హెచ్ఐఐటీని కూడా పరిమితంగా చేయాలి. అధికంగా చేస్తే అలసట, రికవరీ సమస్యలు రావచ్చు.

క్యాలరీ డెఫిసిట్ ముఖ్యం..

బరువు తగ్గడంలో వ్యాయామంతోపాటు క్యాలరీ డెఫిసిట్ కీలక పాత్ర పోషిస్తుంది. వ్యాయామం చేసినా రోజువారీగా తీసుకునే కేలరీలు ఖర్చు చేసే కేలరీల కంటే ఎక్కువగా ఉంటే బరువు తగ్గడం కష్టమే. అందుకే శరీరానికి అనుకూలంగా ఉండే వాకింగ్, ఇన్‌క్లైన్ వాకింగ్, స్విమ్మింగ్ లేదా సైక్లింగ్ వంటి వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయడంతోపాటు ఆహారాన్ని నియంత్రించాలని నిపుణులు సూచిస్తున్నారు.

కండరాల పెరుగుదలకు ఇదే బెస్ట్ డైట్..



కండరాలను పెంచుకోవాలంటే వ్యాయామంతోపాటు సమతుల్య ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. శరీర బరువులో ప్రతి కిలోకు రోజుకు 1.6--2.2 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. గుడ్లు, పనీర్, టోఫు, చికెన్, చేపలు, గ్రీక్ పెరుగు, పప్పులు వంటి ప్రోటీన్ పదార్థాలను ఆహారంలో చేర్చుకోవాలి. ఓట్స్, బ్రౌన్ రైస్, చిలగడదుంప, క్వినోవా వంటి కార్బోహైడ్రేట్లు వ్యాయామానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. వ్యాయామానికి ముందు అరటిపండు లేదా టోస్ట్ వంటి తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవచ్చు. వ్యాయామం తర్వాత ప్రోటీన్‌తోపాటు కార్బోహైడ్రేట్లు తీసుకోవడం కండరాల పునరుద్ధరణకు తోడ్పడుతుంది. రోజుకు తగినంత నీరు తాగడంతోపాటు 7--8 గంటల నిద్ర కూడా అవసరం. కేవలం ప్రోటీన్‌పైనే ఆధారపడకుండా ఆహారం, వ్యాయామం, విశ్రాంతిని సమతుల్యంగా పాటిస్తే కండరాల పెరుగుదలకు మెరుగైన ఫలితాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

స్టూడెంట్ వీసాలపై ఆస్ట్రేలియా కఠిన నిర్ణయం

-భారతీయ విద్యార్థుల వీసాల తిరస్కరణకు భారీగా పెరిగిన రేటు
-2026 జూన్‌లో 24.2 శాతానికి చేరిన వీసాల తిరస్కరణ
-పదేళ్లలో ఎన్నడూ లేనంత స్థాయికి పెరిగిన తిరస్కరణ రేటు
-భారత్ నుంచి దరఖాస్తు చేసుకున్న 40 శాతం విద్యార్థులకు నిరాశ
-నేపాల్ విద్యార్థుల వీసాల తిరస్కరణ 51 శాతం
-చైనా విద్యార్థుల వీసా తిరస్కరణ రేటు 5.8 శాతమే
-వలసల అవసరాలకు అనుగుణంగా తనిఖీలు పెంచిన ఆస్ట్రేలియా
-వీసా తిరస్కరణకు గురైనవారికి రివ్యూ, మళ్లీ దరఖాస్తు అవకాశం



న్యూఢిల్లీ:(వార్త సంధ్య) సెప్టెంబర్ 11.

అంతర్జాతీయ విద్యార్థులకు జారీ చేసే వీసాలను ఆస్ట్రేలియా తగ్గించింది. దీంతో భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడింది. గడిచిన పదేళ్లలో స్టూడెంట్ వీసాల తిరస్కరించిన రేటు తారా స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. ఆ దేశ హోంశాఖ డేటా ప్రకారం 2026 జూన్‌లో 24.2 శాతం మేర స్టూడెంట్ వీసాలను ఆస్ట్రేలియా తిరస్కరించినట్లు తెలిసింది. 2016 జూన్‌లో 7.9 శాతంగా ఉన్న తిరస్కరణ రేటు.. ఇక 2026 జూన్ వరకు అత్యధిక స్థాయికి చేరినట్లు ప్రభుత్వ డేటా ద్వారా వెల్లడైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నేపాల్, ఇండియా స్టూడెంట్ల వీసాలను ఆస్ట్రేలియా అత్యధిక స్థాయిలో తిరస్కరించింది. నేపాల్‌కు చెందిన 51 శాతం మంది విద్యార్థులను వీసాలను, భారత్‌కు చెందిన 40 శాతం మంది విద్యార్థులను వీసాలను తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఇక చైనా విద్యార్థుల వీసాల తిరస్కరణ రేటు 5.8 శాతం ఉన్నట్లు గుర్తించారు. వలసల అవసరాలకు తగినట్లు చెకింగ్ చేస్తున్నట్లు ఆస్ట్రేలియా చెబుతున్నా.. విద్యార్థుల వీసాలపై స్ట్రూట్నీ పెరిగినట్లు డేటా ద్వారా తెలుస్తోంది. ఆస్ట్రేలియా వీసా తిరస్కరణకు గురైన విద్యార్థులు ముందుగా రెఫ్యూజల్ లెటర్‌ను పరిశీలించాలి, దాంట్లో పేర్కొన్న కారణాలను విశ్లేషించుకోవాలి, ఒకవేళ న్యాయపరంగా కరెక్టుగా ఉంటే, అవసరమైతే మళ్లీ దరఖాస్తు చేసుకునే వీలు ఉంటుంది. అడ్మినిస్ట్రేటివ్ రివ్యూ ట్రిబ్యునల్ ద్వారా విద్యార్థులు మరోసారి తమ వీసా అప్లికేషన్ చేసుకోవచ్చు.

మద్యం మత్తులో సర్జరీ చేసిన డాక్టర్.. బాబుకు జన్మనిచ్చి గర్భిణి మృతి

-డాక్టర్ కేపీ మద్యం మత్తులోనే గర్భిణి జూలీకి సర్జరీ
-ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తుండగా ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించిన అంబులెన్స్ డ్రైవర్
-పురిటినొప్పులతో ఆస్పత్రికి చేరిన జూలీకి రాత్రివేళ సర్జరీ
-మద్యం మత్తులో తూగుతూనే ఆపరేషన్ చేసిన డాక్టర్ కేపీ
-మగబిడ్డకు జన్మనిచ్చిన అనంతరం విషమించిన జూలీ పరిస్థితి
-బరేలీ పెద్దాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి
-వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ
-డాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు చేసి దర్యాప్తు



న్యూఢిల్లీ:(వార్త సంధ్య) సెప్టెంబర్ 11.

ఉత్తర ప్రదేశ్‌లో దారుణం జరిగింది. ఒక గర్భిణికి మద్యం మత్తులో ఉన్న డాక్టర్ సర్జరీ చేయడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన యూపీ, షాజహాన్‌పూర్ జిల్లాలో ఈ నెల 8న జరిగింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. పువాయాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకర్త గ్రామానికి చెందిన జూలీ అనే యువతి గర్భవతి.ఆమెకు సెప్టెంబర్ 8న సాయంత్రం పురిటినొప్పులు రావడంతో ఒక అంబులెన్సులో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. మార్గమధ్యలో అంబులెన్స్ డ్రైవర్ పువాయాన్ సమీపంలోని ఒక ప్రైవేటు సమీపంలో ఆపాడు. అక్కడే చికిత్స బాగుంటుందని సూచించాడు. దీంతో అప్పటికే నొప్పులతో ఇబ్బంది పడుతున్న జూలీని అదే ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ రాత్రి పూట డ్యూటీలో ఉన్న డా.ఫిరోజ్.. మరో డాక్టర్ కేపీకి సమాచారం అందించాడు. దీంతో డాక్టర్ కేపీ ఆస్పత్రికి చేరుకున్నాడు. అప్పటికే అతడు మద్యం మత్తులో, తూగుతున్నాడు. అయినప్పటికీ సర్జరీ చేశాడు. జూలీ.. బాబుకు జన్మనిచ్చింది. కానీ, ఆ తర్వాత జూలీ పరిస్థితి విషమించింది. దీంతో ఆమెను బరేలీలోని పెద్దాసుపత్రికి తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు సూచించారు. వారి సూచన మేరకు జూలీని అంబులెన్సులో తీసుకెళుండగా, మార్గమధ్యలో మరణించింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ మద్యం మత్తులో సర్జరీ చేయడం వల్లే జూలీ మరణించిందని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐ టెక్నాలజీతో మిస్సైళ్లు అభివృద్ధి చేస్తున్న యెమెన్ హౌతీలు: ఆంథ్రోపిక్ రిపోర్టు



న్యూఢిల్లీ:(వార్త సంధ్య) సెప్టెంబర్ 11.

ఏఐతో మానవాళి అంతం అయ్యే అవకాశాలు ఉన్నట్లు ఆంథ్రోపిక్ పరిశోధకుడు జాకబ్ కాక్సన్ అందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ భయాందోళనలకు తగినట్లే ఆంథ్రోపిక్ సంస్థ ఓ చేదు నిజాన్ని వెల్లడించింది. యెమెన్‌లోని హౌతీలు తమ క్లాడ్ ఏఐ టెక్నాలజీతో ఆయుధాలను డెవలప్ చేస్తున్నట్లు ఆంథ్రోపిక్ పేర్కొన్నది. క్షిపణులు, రాకెట్లకు చెందిన సాఫ్ట్‌వేర్‌ను క్లాడ్ ఏఐ ద్వారా డెవలప్ చేస్తున్నట్లు గుర్తించారు. క్లాడ్ మోడల్‌తో ఆయుధాలు తయారీ చేస్తున్న వివిధ బృందాలను గుర్తించినట్లు ఆ కంపెనీ వెల్లడించింది.చైనా, రష్యా, యెమెన్ దేశాల్లో క్లాడ్ మోడల్ ఆపరేషన్స్ జరుగుతున్నట్లు ఆంథ్రోపిక్ సంస్థ పేర్కొన్నది. యెమెన్‌లోని ఓ గ్రూపు.. మిస్సైల్ ప్రోగ్రామ్‌పై పనిచేస్తున్నదని, బాలిస్టిక్ క్షిపణులను ఆ గ్రూపు తయారు చేస్తున్నట్లు ఆంథ్రోపిక్ తెలిపింది. అయితే మానవ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల స్థానంలో ఆ గ్రూపు క్లాడ్ కోడ్‌ను వాడినట్లు ఆంథ్రోపిక్ ఆందోళన వ్యక్తం చేసింది. ఎగిరే వాహనాల కోసం కావాల్సిన గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ సాఫ్ట్‌వేర్ డెవలప్ కోసం క్లాడ్ కోడింగ్‌ను వాడుతున్నట్లు తెలిసింది. అయితే క్లాడ్ టెక్నాలజీ ఆధారంగా నిర్మించిన ఓ రాకెట్ ప్రయోగం వేళ విఫలమైనట్లు తెలిసిందన్నారు. క్షిపణికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను కేవలం క్లాడ్ కోడింగ్‌తో యెమెన్ సంస్థ డెవలప్ చేసినట్లు ఆంథ్రోపిక్ చెప్పింది. ఏఐ మోడల్స్ ద్వారా జీవాయుధాలను తయారు చేసే అవకాశాలు ఉన్నట్లు కూడా ఆంథ్రోపిక్ సంస్థ తన హెచ్చరికలో పేర్కొన్నది.

కాళీమాత గుడిలో చేపలు తిన్న బెంగాల్ సీఎం

న్యూఢిల్లీ:(వార్త సంధ్య) సెప్టెంబర్ 11.

దుర్గాపూజ వేళ మాంసాహారం తినరాదు అని బెంగాలీలకు ఇటీవల ఓ హిందూ సాధువు సూచన చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీశాయి. గుడిలో మాంసాహారాన్ని భుజించడం సంప్రదాయమా కాదా అన్న చర్చ జరిగింది. కానీ బెంగాల్‌లో మాత్రం గుడిలో చేపల్ని తింటారు. ఇక గురువారం కౌశిక్ అమావాస్య సందర్భంగా ఆ రాష్ట్ర సీఎం సువేందు అధికారి చేపలు తిన్నారు. కోల్‌కతాలోని కాళీఘాట్‌ను విజిట్ చేసిన ఆయన అక్కడ అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన ఫ్రై చేపను భుజించారు. ఫ్రైడ్ ఫిష్‌తో పాటు బసంతి పులావ్ ఆయన ప్లేట్‌లో ఉన్నట్లు ఫోటోలు, వీడియోలు రిలీజ్ అయ్యాయి.కాళీమాతకు మేక మాంసం. చేపల్ని నైవేద్యంగా పెట్టడం బెంగాల్‌లో సంప్రదాయం. ఇక ఆ నైవేద్యాన్ని భక్తితో భక్తులు సేవిస్తారు. అయితే శాఖాహార భోజన పద్ధతులను బెంగాలీలపై రుద్దుతున్నట్లు బీజేపీపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీఎం సువేందు అధికారి తాజా స్టంట్‌తో చెక్ పెట్టే ప్రయత్నం చేశారు. ఈ ఘటనతో శాఖాహార, మాంసాహార చర్చ ముగుస్తుందని ఆశిస్తున్నట్లు బీజేపీ పేర్కొన్నది. బెంగాలీ విశ్వాసాలను, సంప్రదాయాలను, జీవన



విధానాలను గౌరవిస్తామని, సీఎం సువేందు అధికారి నాయకత్వంలో బెంగాలీలకు అన్ని ప్రయోజనాలు కలిగేలా చేస్తామని బీజేపీ ప్రతినిధి ప్రదీప్ భండారి తెలిపారు. ఇటీవల భగేశ్వర్ ధామ్‌కు చెందిన ధీరేంద్ర శాస్త్రి.. ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ దుర్గాపూజ వేళ మాంసాహారాన్ని విడిచిపెట్టాలని పేర్కొన్నారు. దుర్గాపూజ వేళ నాన్ వెజ్ తింటున్న బెంగాలీలను పాకండులు అంటూ విమర్శించారు. బెంగాల్‌లోని మాంసం, లిక్కర్ షాపులు దుర్గాపూజ వేళ మూసివేయాలని కూడా భగేశ్వర్ బాబా తన ప్రసంగంలో తెలిపారు. ఆ వ్యాఖ్యలతో బెంగాలీ ప్రజల్లో వెజ్-నాన్‌వెజ్ అంశంపై చర్చ మొదలైంది. కానీ ఆ బాబాను ఓ కార్యక్రమానికి సీఎం ఆహ్వానించారు. బెంగాలీ ఆహార నియమావళి విషయంలో ఎవరూ తమకు హుకుం ఇవ్వలేరని సీఎం అన్నారు. బెంగాలీలు చేపలు, మాంసాన్ని తింటారని, ఈ అంశంలో వివేకానంద కూడా బెంగాలీలకు అనుకూలంగా మాట్లాడారని ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ సమిక్ భట్టాచార్య తెలిపారు. భగేశ్వర్ బాబా దిష్టబొమ్మలను దగ్ధం చేసిన వారిని అరెస్టు చేయాలని సీఎం ఆదేశించారు. తాను సనాతన హిందువును అని, మహాష్టమి నాడు దుర్గామాతను పూజిస్తానని, ఆ రోజు సాత్విక ఆహారాన్ని తీసుకుంటానని, కార్తీక మాసంలో కూడా శాఖాహారం తింటానని, అయితే కాళీమాతకు నైవేద్యం పెట్టిన నాన్‌వెజ్ ఆహారాన్ని కూడా తింటానని, ఇవాళ కాళీ గుడిలో అమ్మవారికి చేప తల, ఫ్రైడ్ ఫిష్, బసంతి పులావ్ పెట్టారని, వాటిని తిన్నట్లు సీఎం తెలిపారు.

పాకిస్తాన్‌లో మైనర్ హిందూ బాలికలపై దారుణం

-అంజాద్ సోలాంగి, మన్సూర్ సోలాంగి చేతిలో 13, 14 ఏళ్ల అక్కాచెల్లెళ్ల కిడ్నాప్
-బాలికలను బలవంతంగా ఇస్లాంలోకి మార్చిన నిందితులు
-మతమార్పిడి అనంతరం బాలికలకు బలవంతపు వివాహం
-తమను తల్లిదండ్రుల వద్దకు పంపాలంటూ కోర్టులో బాలికల వేడుకోలు
-బాలికల అభ్యర్థనను పట్టించుకోని జిల్లా కోర్టు
-తల్లిదండ్రుల వద్దకు పంపకుండా సురక్షిత ప్రాంతానికి తరలింపు
-సింధ్‌లో పది రోజుల్లో ఆరుగురు మైనర్ బాలికల కిడ్నాప్
వరుస ఘటనలపై సింధీ హక్కుల సంస్థ ఆందోళన




న్యూఢిల్లీ:(వార్త సంధ్య) సెప్టెంబర్ 11.

పాకిస్తాన్‌లో మైనారిటీలపై వేధింపులు, దాడులు సాధారణమయ్యాయి. ముఖ్యంగా హిందూ యువతుల్ని కిడ్నాప్ చేసి, బలవంతపు మతమార్పిడులకు పాల్పడుతున్నారు. తాజాగా, అలాంటి ఒక ఘటనే ఇటీవల పాకిస్తాన్‌లో జరిగింది. 13, 14 ఏళ్ల వయసున్న హిందూ అక్కాచెల్లెళ్లను కిడ్నాప్ చేసి, బలవంతపు మత మార్పిడి చేశారు. అనంతరం పెళ్లి కూడా చేసుకున్నారు. ఈ ఘటన ఈ నెల 9న పాకిస్తాన్, సింధ్ ప్రాంతంలోని తాండో అల్లహ్యార్ జిల్లాలో జరిగింది. ఈ ప్రాంతంలో హిందువులు ఎక్కువగా ఉంటారు.కచ్చి కోల్హి అనే హిందూ మతానికి చెందిన 13, 14 ఏళ్ల బాలికలను అంజాద్ సోలాంగి, మన్సూర్ సోలాంగి అనే ఇద్దరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. బలవంతంగా ఇస్లాంలోకి మార్చారు. అనంతరం పెళ్లి చేసుకున్నారు. ఈ ఘటనపై బాధిత కుటుంబం స్థానిక జిల్లా కోర్టును ఆశ్రయించింది. బాధిత బాలికలు ఇద్దరూ కోర్టుకు హాజరయ్యారు. తమను కిడ్నాప్ చేసి, మత మార్పిడి చేసి, బలవంతంగా పెళ్లి చేసుకున్నారని ఆ బాలికలు కోర్టుకు తెలిపారు. తమను తల్లిదండ్రులతోపాటు ఇంటికి పంపించాలని బాలికలు కోర్టును వేడుకున్నారు. అయినప్పటికీ కోర్టు కరుణించలేదు. బాలికలను తమ తల్లిదండ్రులు ఉండే ఇంటికి పంపించేందుకు కోర్టు నిరాకరించింది. బాలికలను సురక్షిత ప్రదేశానికి మాత్రమే తరలించాలని కోర్టు ఆదేశించింది. ఈ విషయంలో బాలికలు న్యాయమూర్తిని ఎంతగా వేడుకున్నా, కన్నీళ్లు పెట్టుకున్నా సరైన స్పందన రాలేదు. ఈ ఘటన అక్కడి హిందువుల విషయంలో పాక్ ముస్లిం ప్రజలు, వ్యవస్థలు ఎలా ప్రవర్తిస్తున్నాయో తెలియజేస్తుంది. పాకిస్తాన్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై అమెరికాకు చెందిన సింధీ హక్కుల సంస్థ ఆవేదన వ్యక్తం చేసింది. సింధ్ జిల్లాలో గడిచిన పది రోజుల్లో ఆరుగురు మైనర్ బాలికలను కిడ్నాప్ చేసి, మత మార్పిడులకు పాల్పడ్డారని ఈ సంస్థ తెలిపింది. ఇటువంటి ఘటనలు పాకిస్తాన్‌లో సర్వసాధారణమైపోయాయని వెల్లడించింది.

26 ఏళ్ల యువకుడిలో గర్భసంచి..

-ఇన్‌ఫెర్టిలిటీ పరీక్షలో బయటపడ్డ అరుదైన లక్షణం



న్యూఢిల్లీ:(వార్త సంధ్య) సెప్టెంబర్ 11.

ఢిల్లీలో ఒక అరుదైన వైద్య ఘటన జరిగింది. స్త్రీలలో మాత్రమే ఉండే గర్భసంచి.. ఒక 26 ఏళ్ల యువకుడిలో గుర్తించారు. ఇదో అరుదైన శారీరక లక్షణమని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి. ఢిల్లీకి చెందిన 26 ఏళ్ల ఒక యువకుడు సంతానలేమి సమస్యతో ఇటీవల ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం వెళ్లాడు. అక్కడ ప్రత్యేక వైద్య నిపుణులు అతడికి పలు పరీక్షలు నిర్వహించారు. అతడికి మగవారికి లాగే అవయవాలు, ఇతర లక్షణాలు సాధారణంగానే ఉన్నాయి.కానీ, కొన్నింటిలో తేడాలున్నట్లు వైద్యులు గుర్తించారు. అతడికి రెండు వృషణాలు లేవు. అలాగే, వీర్య పరీక్ష నిర్వహించగా శుక్రకణాలు అస్సలు లేవని తేలింది. దీంతో అతడికి వైద్యులు మరిన్ని పరీక్షలు నిర్వహించారు. క్రోమోజోమ్ పరీక్ష నిర్వహించగా మగవారికి ఉండే ఎక్స్‌వై మేల్ క్రోమోజోమ్‌లే ఉన్నాయి. ఈ విషయంలో ఎలాంటి లోపం లేదు. అనంతరం అతడికి ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ స్కానింగ్ నిర్వహించగా షాకింగ్ విషయం బయటపడింది. అదే.. అతడికి గర్భసంచి ఉండటం. అది కూడా మహిళల్లాగే పూర్తిస్థాయి గర్భసంచిని అతడి కడుపులో వైద్యులు గుర్తించారు. అలాగే, వృషణాలు కూడ గర్భసంచి లోపల ఉన్నాయి. అవి కూడా మహిళల్లో ఉండే అండాలలాగా ఉన్నట్లు కనుగొన్నారు. ఇలా మగవారిలో గర్భసంచి, అండాలు ఉండటాన్ని వైద్య పరిభాషలో పెర్సిస్టెంట్ ముల్లేరియన్ డక్ట్ సిండ్రోమ్ (పీఎండీఎస్) అంటారని వైద్య నిపుణులు అంటున్నారు. ఇది చాలా అరుదైన లక్షణమని అన్నారు. వారు మగవారిలాగే, ఇతర అవయవాలు, లక్షణాలు కలిగి ఉన్నప్పటికీ గర్భసంచి, అండాలు కలిగి ఉంటారని వైద్య నిపుణులు వివరించారు. ఇక, వీర్యంలో శుక్రకణాలు లేకపోవడాన్ని అజూస్పెర్మియా అంటారని కూడా వైద్యులు తెలిపారు. వీరికి పిల్లలు పుట్టే అవకాశాలు తక్కువే ఉంటాయన్నారు. ఈ అరుదైన లక్షణాలు బయటపడ్డ వ్యక్తిలోని గర్భసంచిని, వృషణాల్ని తొలగించామని వైద్యులు తెలిపారు. దీనికి కారణం ఉందన్నారు. ఇవి ఇలాగే ఉండిపోతే.. అవి క్యాన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందని, అందుకే వాటిని అతడి శరీరం నుంచి తొలగించామని చెప్పారు. ప్రస్తుతం అతడు క్షేమంగానే ఉన్నట్లు తెలిపారు. అతడి గర్భసంచి, వృషణాల్ని పరీక్షల కోసం పంపించామన్నారు

స్టూడెంట్ వీసాలను తగ్గించిన ఆస్ట్రేలియా..



న్యూఢిల్లీ:(వార్త సంధ్య) సెప్టెంబర్ 11.

అంతర్జాతీయ విద్యార్థులకు జారీ చేసే వీసాలను ఆస్ట్రేలియా తగ్గించింది. దీంతో భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడింది. గడిచిన పదేళ్లలో స్టూడెంట్ వీసాల తిరస్కరించిన రేటు తారా స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. ఆ దేశ హోంశాఖ డేటా ప్రకారం 2026 జూన్‌లో 24.2 శాతం మేర స్టూడెంట్ వీసాలను ఆస్ట్రేలియా తిరస్కరించినట్లు తెలిసింది. 2016 జూన్‌లో 7.9 శాతంగా ఉన్న తిరస్కరణ రేటు.. ఇక 2026 జూన్ వరకు అత్యధిక స్థాయికి చేరినట్లు ప్రభుత్వ డేటా ద్వారా వెల్లడైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నేపాల్, ఇండియా స్టూడెంట్ల వీసాలను ఆస్ట్రేలియా అత్యధిక స్థాయిలో తిరస్కరించింది. నేపాల్‌కు చెందిన 51 శాతం మంది విద్యార్థులను వీసాలను, భారత్‌కు చెందిన 40 శాతం మంది విద్యార్థులను వీసాలను తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఇక చైనా విద్యార్థుల వీసాల తిరస్కరణ రేటు 5.8 శాతం ఉన్నట్లు గుర్తించారు. వలసల అవసరాలకు తగినట్లు చెకింగ్ చేస్తున్నట్లు ఆస్ట్రేలియా చెబుతున్నా.. విద్యార్థుల వీసాలపై స్ట్రూట్నీ పెరిగినట్లు డేటా ద్వారా తెలుస్తోంది. ఆస్ట్రేలియా వీసా తిరస్కరణకు గురైన విద్యార్థులు ముందుగా రెఫ్యూజల్ లెటర్‌ను పరిశీలించాలి, దాంట్లో పేర్కొన్న కారణాలను విశ్లేషించుకోవాలి, ఒకవేళ న్యాయపరంగా కరెక్టుగా ఉంటే, అవసరమైతే మళ్లీ దరఖాస్తు చేసుకునే వీలు ఉంటుంది. అడ్మినిస్ట్రేటివ్ రివ్యూ ట్రిబ్యునల్ ద్వారా విద్యార్థులు మరోసారి తమ వీసా అప్లికేషన్ చేసుకోవచ్చు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

సంయుక్త మీనన్ బర్త్ డే టీజర్ విడుదల..

- వీరనారి అవతారం లుక్‌కు ఫిదా అవుతున్న ఫ్యాన్స్!



నిఖిల్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో సంయుక్త, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం దాదాపు రెండేళ్లుగా షూటింగ్ జరుపుకుని ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఈ రోజు సంయుక్త మీనన్ బర్త్ డే సందర్భంగా 40 సెకన్ల టీజర్ విడుదల చేశారు. ఇందులో వీరనారి పాత్రలో సంయుక్త కనిపించిన తీరు, కత్తి యుద్ధాలు చేసిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.ఇప్పటివరకు గ్లామర్, ఎమోషనల్ పాత్రల్లో కనిపించిన సంయుక్త.. 'స్వయంభు'లో మాత్రం పూర్తి భిన్నమైన అవతారంలో కనిపించబోతున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. 'స్వయంభు' కథ చారిత్రక నేపథ్యంలో సాగనున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతోంది. రాజ్యాలు, అంతర్యుద్ధాలు, ప్రజలను కాపాడేందుకు జరిగే పోరాటాలు, వీరత్వంతో కూడిన సన్నివేశాలతో సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలో సంయుక్త పోషిస్తున్న పాత్రకు కూడా కథలో కీలకం కానుంది. చేతిలో కత్తి పట్టుకుని యుద్ధరంగంలో పోరాడుతున్న ఆమె సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీరనారి గెటప్‌లో సంయుక్త లుక్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. మరో హీరోయిన్ నభా నటేశ్ కూడా ఈ సినిమాలో యువరాణి పాత్రలో కనిపించనుంది. ఆ మధ్య విడుదలైన టీజర్‌లో ఆమె లుక్ కూడా రాజసం ఉట్టిపడేలా ఉంది. చారిత్రక నేపథ్యానికి తగ్గట్టుగా రూపొందించిన సెట్స్, వస్త్రధారణ, పాత్రల లుక్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. నిఖిల్ కూడా తన కెరీర్‌లో ఇంతకు ముందు చేయని తరహా పాత్రలో కనిపించనున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఉన్నట్లు కనిపిస్తోంది. కమెడియన్ సునీల్ ఈ సినిమాలో పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఆయన పాత్ర ఎలా ఉండబోతుందనేది ఆసక్తిని కలిగిస్తోంది. చారిత్రక నేపథ్యానికి భారీ యాక్షన్, విజువల్స్, డ్రామాను జోడించి సినిమాను రూపొందించినట్లు కనిపిస్తోంది.

ప్రభాస్ 'ఫౌజీ' వాయిదా?

'స్పిరిట్' విడుదలపై పడనున్న ప్రభావం!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న సినిమాల విడుదల తేదీలకు సంబంధించి సోషల్ మీడియాలో తాజాగా రకరకాల ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' సినిమాను తొలుత డిసెంబర్ 3, 2026న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. అయితే షూటింగ్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ పనుల ఆలస్యం కారణంగా ఈ చిత్రాన్ని 2027 మార్చికి వాయిదా వేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. దీనిపై చిత్ర యూనిట్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.అయితే ఒకవేళ 'ఫౌజీ' విడుదల తేదీ మార్చికి మారితే, అది ప్రభాస్ ఇతర సినిమాల షెడ్యూల్‌పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటించనున్న భారీ బడ్జెట్ సినిమా 'స్పిరిట్'ను మార్చి 5, 2027న విడుదల చేసేలా ఇదివరకే షెడ్యూల్ ప్రకటించారు. 'ఫౌజీ' డేట్ మారుతుందనే ప్రచారం నేపథ్యంలో 'స్పిరిట్' విడుదల కూడా వాయిదా పడుతుందనే టాక్ వినిపిస్తోంది. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక స్పష్టత లేదు. నిర్మాణ సంస్థల నుంచి తుది నిర్ణయం వెలువడితేనే ఈ డేట్లపై పూర్తి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.




ట్రెడిషనల్ లుక్‌లో అదరగొట్టిన 'బేబ' బ్యూటీ వైష్ణవి చైతన్య..!

అలా కనిపించడమే నా లక్ష్యం

కేవలం అందంతో మాత్రమే కాకుండా నటనతో ప్రేక్షకుల మనసుల్ని గెలవాలన్నదే తన లక్ష్యం అంటున్నది కన్నడభామ అషికా రంగనాథ్. ఈ గురువారం 'సర్దార్ 2' సినిమా ద్వారా పాన్ ఇండియా ప్రేక్షకులను పలకరించింది ఈ అందాలభామ. పాత్రల ఎంపిక గురించి అషికా మాట్లాడుతూ 'సినీరంగంలోకి ప్రవేశించిన రెండుమూడేళ్లకే తెలుగులో అవకాశాలు వచ్చాయిఆ టైమ్‌లో ఎలాంటి పాత్రలను ఎంచుకోవాలో కూడా నాకు తెలియదు. వచ్చిన ప్రతి సినిమాకూ ఓకే చెప్పాను. ఇప్పుడు నాలో పరిపక్వత వచ్చింది. స్టార్ హీరోల పక్కన మెరవడం కంటే, ప్రాధాన్యత ఉన్న పాత్రల్లో నటించడానికే ఆసక్తిగా ఉన్నా. కథ విన్నప్పుడు అందులో నా పాత్ర, ప్రేక్షకులపై దాని ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని సినిమాలకు ఓకే చెబుతున్నాను. నటించిన ప్రతి సినిమాలోనూ కొత్తగా కనిపించడమే నా లక్ష్యం' అంటూ చెప్పుకొచ్చింది అషికా రంగనాథ్.

త్రివిక్రమ్ క్రేజీ ప్లాన్..

తెలుగులోకి 'హనుమాన్ అంశ్'!



ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా తెరకెక్కిన సంచలన చిత్రం 'హనుమాన్ అంశ్' బాలీవుడ్‌లో కలెక్షన్లతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. అయితే ఇంతటి ఘనవిజయం సాధించిన సినిమా తెలుగులోకి రాబోతున్నట్లు తెలుస్తుంది. హిందీ బెల్ట్‌లో ఘన విజయం సాధించి ప్రేక్షకాదరణ పొందిన ఈ చిత్రాన్ని, టాలీవుడ్ ప్రముఖ అగ్ర దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెలుగులో విడుదల చేసే బాధ్యతలను తీసుకున్నట్లు సమాచారం.ఈ విషయాన్ని చిత్ర నిర్మాత నమ్రతా సింగ్ స్వయంగా వెల్లడించారు. భక్తి, దైవిక అంశాలతో రూపొందిన ఈ బయోపిక్ డ్రామాను తెలుగులోనూ అదే స్థాయిలో విజయవంతం చేసేందుకు త్రివిక్రమ్ చొరవ తీసుకోవడం విశేషం. తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ భక్తి చిత్రాలను విశేషంగా ఆదరిస్తుంటారు కాబట్టి, 'హనుమాన్ అంశ్' తెలుగు వెర్షన్‌పై అటు ఆధ్యాత్మిక వర్గాల్లో, ఇటు సినీ పరిశ్రమలో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక విడుదల తేదీ వెలువడనుంది.

డిసెంబర్‌లో వస్తున్న వృషకర్మ

నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'. కార్తీక్ దండు దర్శకుడు. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మాతలు. మైథాలజీ, మిస్టరీ, థ్రిల్లర్ అంశాల కలబోతగా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ చిత్రంలో నాగచైతన్య ట్రెజర్ హంటర్‌గా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారు. ఆయన మేకోవర్ సరికొత్తగా ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉందని, అత్యుత్తమ ప్రమాణాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. మీనాక్షి చౌదరి, స్పర్ష శ్రీవాస్తవ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ బి లోక్‌నాథ్, దర్శకత్వం: కార్తీక్ దండు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.